నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
ఆదిలాబాద్
బుధవారం | ఫిబ్రవరి 28, 2024 | www.navatelangana.com

నేటి నుండి ఇంటర్ పరీక్షలు

నవతెలంగాణ-ఉట్నూర్

ఇంటర్ పరీక్షలు బుధవారం నుండి నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ప్రవీణ్ తెలిపారు. నిమిషం ఆలస్యమైనా పరీక్షకు అనుమతించామని, విద్యార్థులు సమయానికి సెంటర్ వద్దకు చేరుకోవాలని తెలిపారు. పట్టణంలో మొత్తం 6సెంటర్లు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. సెంటర్ల వద్ద 144 సెక్షన్ విధించినట్లు తెలిపారు. పరీక్షలు 28 నుంచి మార్చి 19 వరకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సాగుతాయని తెలిపారు.

నార్నూర్ : ఇంటర్మీడియట్ పరీక్షలకు ఏర్పాటు పూర్తి చేశామని చీఫ్ సూపరింటెండెంట్ వెంకట రమణ, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్ సువర్ణ పేర్కొన్నారు. మొదటి సంవత్సరం పరీక్షలకు 302 మంది విద్యార్థులు, రెండో సంవత్సర పరీక్షలకు 290 మంది హాజరవుతున్నట్లు తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశామన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలో పలు అభివృద్ధి పనులు కొనసాగుతున్న నేపథ్యంలో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ సదానందం మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తామని తెలిపారు. పట్టణంలోని ఓల్డ్ బస్టాండ్, రాణిసతిజి టెంపుల్ రోడ్డు, అశోక్‌రోడ్ ఏరియాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, ఈ అంతరాయానికి విద్యుత్ వినియోగదారులందరూ సహకరించాలని కోరారు.

పల్లెల్లో తాగునీటి తాపం..!

- జిల్లాలో పడకేసిన మిషన్ భగీరథ పథకం
- 250 ఆవాస ప్రాంతాల్లో సరఫరాకు ఆటంకం
- బావులు, చేతిపంపుల మీద ఆధారపడుతున్న జనం
- ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్న అధికారులు

వేసవి కాలం సమీపిస్తూనే పల్లెల్లో తాగునీటి తాపం మొదలైంది. ఇంటింటికి శుద్ధనీరందించేందుకు నిర్మించిన మిషన్ భగీరథ పథకం అనేక పల్లెల్లో పడకేసింది. ఫలితంగా ఆయా గ్రామాల ప్రజలు తాగునీటికి తిప్పలు పడాల్సి వస్తోంది. బావులు, చెలిమెలు, చేతిపంపుల మీదనే ఆధారపడి దాహం తీర్చుకుంటున్నారు. ప్రతి ఏటా ఈ సమస్య ఉత్పన్నమవుతున్నా అధికార యంత్రాంగం శాశ్వత నివారణ చర్యలు చేపట్టడం లేదనే విమర్శలున్నాయి. వేసవి రాగానే హడావుడి చేస్తున్న అధికారులు సమస్యలను క్షేత్రస్థాయిలో ముందే తెలుసుకొని సరిదిద్ది ఉంటే తాజా ఇబ్బందులు ఎదురయ్యే కావనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. రాష్ట్ర ప్రభుత్వం గతంలో ఎన్నడూలేని విధంగా తాగునీటి సమస్య పరిష్కరించేందుకు నిధులు మంజూరుచేస్తూ నిర్ణయం తీసుకుంది. అవసరమైతే పల్లెల్లో 15వ ఆర్థిక సంఘం నిధులను సైతం వినియోగించుకోవాలని సూచించింది. తాజాగా అధికారులు జిల్లాలోని ఆయా ప్రాంతాలను పరిశీలించి 250 ఆవాస ప్రాంతాల్లో తాగునీటి సమస్య ఉన్నట్లు గుర్తించడం ప్రాధాన్యం సంతరించుకుంది.



ఉట్నూర్ మండలం ఎందా గ్రామ పంచాయతీలోని ఉదా నాయక్ తాండలో తాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉంది. మిషన్ భగీరథ పథకం పనిచేయకపోవడంతో పాటు చేతిపంపులు కూడా పనిచేయడం లేదు. ఫలితంగా గ్రామ సమీపంలోని పంట పొలంలోని బోరుబావి నుంచి తెచ్చుకొని దాహం తీర్చుకుంటున్నారు. అధికారులు గ్రామానికి వచ్చి సమస్య పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి, ఉట్నూర్, ఇంద్రవెల్లి

ఉమ్మడి జిల్లాలోని ఏజెన్సీ పల్లెలు తాగునీటికి అల్లాడుతున్నాయి. ప్రతి ఏటా మాదిరిగానే ఈ సంవత్సరం కూడా తాగునీటికి తిప్పలు తప్పడం లేదు. రూ.కోట్లు వెచ్చించి నిర్మించిన మిషన్ భగీరథ పథకం అనేక గ్రామాల్లో పనిచేయకపోవడంతో తాగునీటి సమస్య ఉత్పన్నమవుతోంది. పైప్‌లైన్లు పగిలిపోవడం, లీకేజీలు, ట్యాంకులు, సంపుల వద్ద సమస్యలతో పాటు విద్యుత్ సమస్యల కారణంగా తాగునీటి సరఫరాలో లోపాలు తలెత్తుతున్నాయి. ఈ సమస్య ముందు నుంచే ఉన్నా.. అధికార యంత్రాంగం వీటిని సరిచేయడం లేదు. వారి దృష్టికి వచ్చిన వాటిని మాత్రమే సరిచేసి నీటి సరఫరా చేస్తున్నారు తప్పితే..క్షేత్రస్థాయిలో మారుమూల పల్లెల్లో పర్యటించి సమస్యలు తెలుసుకోవడంలో విఫలమవుతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అధికారులు పట్టించుకోకపోవడం.. పాలకులు దృష్టిసారించకపోవడం మూలంగా వేసవిలో అనేక పల్లెలు తాగునీటికి ఇబ్బందులు పడాల్సి వస్తోంది. మిషన్ భగీరథ పథకంలో భాగంగా ప్రతి గ్రామంలో ట్యాంకులు నిర్మించి..పైప్‌లైన్లు వేసి ఇంటింటికి నల్లాలు బిగించినా.. ఎలాంటి ఫలితం కనిపించడం లేదనే ఆరోపణలున్నాయి. మైదాన ప్రాంతాల్లో కొంత వరకు బాగానే పనిచేస్తున్నా..ఏజెన్సీలో మాత్రం పర్యవేక్షణ లేని కారణంగా సమస్యలు వస్తున్నట్లు తెలుస్తోంది.

250 ఆవాస ప్రాంతాల్లో సమస్య..!

ఆదిలాబాద్ జిల్లాలో 1234 ఆవాస ప్రాంతాలు ఉండగా వీటిలో సుమారు 250 ఆవాస ప్రాంతాల్లో తాగునీటి సమస్య ఉందని అధికారులు గుర్తించారు. క్షేత్రస్థాయిలో మిషన్ భగీరథ పనితీరును పరిశీలించిన అధికారులు ఆయా చోట్ల పైప్‌లైన్లు మరమ్మతులు, లీకేజీలు, తదితర కారణాలతో నీటి సరఫరా కావడం లేదని గుర్తించారు. ఇప్పటికే తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ప్రత్యేక అభివృద్ధి నిధులు(ఎస్‌డీఎఫ్) కింద రూ.10కోట్లను ఒక్కో నియోజకవర్గానికి కేటాయించగా..ఇందులో రూ.కోటి వరకు తాగునీటికి వినియోగించుకోవచ్చని సూచించింది. వీటితో పాటు గ్రామాల్లో ఉత్పన్నమయ్యే సమస్యల పరిష్కారానికి 15వ ఆర్థిక సంఘం నిధులను కూడా వాడుకోవచ్చని స్పష్టం చేసింది. ఇన్‌ఛార్జి మంత్రి ఆమోదంతో ఈ నిధులు విడుదల కాగానే ఆయా సమస్యలను పరిష్కరించాల్సిన అవసరం ఉంది. సమస్య ఉన్న చోట్ల భగీరథ నీరు సరఫరా చేసేంత వరకు పంచాయతీ ట్రాక్టర్ల ద్వారా నీటి సరఫరా చేయడం, చేతిపంపులు, తదితర ప్రత్యామ్నాయ చర్యలు చేపడుతామని అధికారులు చెబుతున్నారు.

ఇంద్రవెల్లి మండలం వాల్గొండ గ్రామంలోని పరిస్థితి ఇది. మిషన్ భగీరథ పథకం పనిచేయకపోవడంతో తాగునీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో సమీప బావి నుంచి ఎడ్లబండ్లతో ట్యాంకుల ద్వారా నీటిని తెచ్చుకోవాల్సి వస్తోంది. ఈ మండలంలోని దొడంద, గట్టెపల్లి, సాలేగూడ, ఖైర్‌గూడ, దుబ్బగూడ, మామిడిగూడ(జి) గ్రామాల్లోనూ తాగునీటి ఎద్దడి నెలకొంది. ఇలా ఏజెన్సీ ప్రాంతాల్లోని అనేక పల్లెల్లో తాగునీటి తిప్పలు ప్రారంభమయ్యాయి.





తాగునీటి సమస్య పరిష్కరించాలి : చవాన్ సేవాదాస్, ఉదానాయక్‌తండా

మా గ్రామంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. తాగునీటికి గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. మిషన్ భగీరథ పథకం పనిచేయడం లేదు. చేతిపంపు కూడా మరమ్మతులకు గురైంది. సమీపంలోని పొలం నుంచి నీటిని తెచ్చుకొని దాహం తీర్చుకుంటున్నాం. అధికారులు ఈ సమస్యను పరిష్కరించాలి.

సమస్య పరిష్కారానికి చర్యలు : సురేష్, మిషన్ భగీరథ ఎస్ఈ

జిల్లాలో తాగునీటి సమస్య ఉన్న ఆవాస ప్రాంతాలను గుర్తించాం. కొన్ని చోట్ల పైప్‌లైన్ల లీకేజీలు, మరమ్మతులు, విద్యుత్ తదితర కారణాలతో నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతోంది. వీటిని పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటాం. వీటిని బాగుచేసే వరకు ఆయా పల్లెలకు తాగునీరు సరఫరా చేసేందుకు ప్రత్యామ్నాయ ప్రణాళిక రూపొందించాం.

పరీక్షా కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించాలి

- కేంద్రాన్ని సందర్శించిన సహాయ కమిషనర్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా, అన్ని వసతులు కల్పించాలని పరీక్షల సహాయ కమిషనర్ పద్మ అన్నారు. మంగళవారం నిర్మల్ జిల్లా కేంద్రంలోని బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పదవ తరగతి పరీక్షా కేంద్రాన్ని డీఈఓ రవీందర్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా సహాయ కమిషనర్ మాట్లాడుతూ కేంద్రంలో తాగునీరు, విద్యుత్తు, ఫ్యాన్ వంటి సౌకర్యాలు మెరుగ్గా ఉండేటట్టు చూసుకోవాలన్నారు. ప్రతి పరీక్ష కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, ఎటువంటి మాల్ ప్రాక్టీసు లేకుండా పరీక్షలు నిర్వహించాలని తెలిపారు. అదేవిధంగా పరీక్షా కేంద్రంలో ఉన్నటువంటి ఫర్నీచర్, వాష్ రూమ్ వంటి వసతులను ఒకసారి సరిచూసుకోవాలన్నారు. విద్యార్థులు అన్ని విషయాలను ఇష్టంతో కష్టపడి చదవాలన్నారు. ఉపాధ్యాయులు చెప్పిన అంశాలను చక్కగా అవగాహన చేసుకొని, ఎక్కువగా అభ్యాసం చేసి, వెనుకబడిన విషయాలపై ప్రత్యేక శ్రద్ధ వహించి, ఉత్తమ ప్రతిభ కనబరచాలని సూచించారు. అభ్యాస దీపికలు, మాదిరి ప్రశ్న పత్రాలు ఎక్కువగా ప్రాక్టీస్ చేయాలన్నారు. ఉపాధ్యాయులు పెట్టే స్లిప్ పరీక్షలు తప్పకుండా రాయాలన్నారు. పాత ప్రశ్న పత్రాలను ఎక్కువగా ప్రాక్టీస్ చేయాలని సూచించారు. పరీక్షలకు ఎలా సిద్ధం కావాలి, మానసికంగా దృఢంగా ఉండి, పరీక్షలకు ఎలా సిద్ధం కావాలి అనే విషయాలను విద్యార్థులతో కాసేపు వారు ముచ్చటించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డీఈఓ వైఖరికి నిరసనగా పోరాటం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా విద్యాశాఖాధికారి వైఖరికి నిరసనగా డీఈఓ కార్యాలయం ఎదుట దశలవారీగా పోరాటం చేయాలని టిఎస్‌యూటీఎఫ్ జిల్లా కమిటీ నిర్ణయించింది. మంగళవారం కార్యాలయంలో నిర్వహించిన జిల్లా ఆఫీస్ బేరర్ల సమావేశంలో ఈ అంశంపై చర్చించారు. అనంతరం రాష్ట్ర కార్యదర్శి ఎ.వెంకట్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎ.స్వామి, వి.అశోక్ మీడియాకు ప్రకటన విడుదల చేశారు. ఎఎస్ఓ నియామకంలో డీఈఓ అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. నోటిఫికేషన్‌కు భిన్నంగా అర్హత లేని ఉపాధ్యాయున్ని ఎఎస్ఓగా నియమించుకున్నారన్నారు. అక్రమాలను సవరించుకొని నోటిఫికేషన్ ద్వారా ఎంపికైన వ్యక్తిని ఎఎస్ఓగా నియమించాలని పలుమార్లు ప్రాతినిధ్యం చేసినప్పటికీ డీఈఓ వైఖరి మారనందున దశలవారీ పోరాటానికి సిద్ధమయ్యామని పేర్కొన్నారు. మార్చి 1న డీఈఓ కార్యాలయం ఎదుట ధర్నా, మార్చి 5న పికెటింగ్, మార్చి 6 నుండి నిరవధిక నిరహార దీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. ఇప్పటికైనా తమ వైఖరి మార్చుకుని, చేసిన తప్పును సవరించుకోవాలని, లేనిపక్షంలో పోరాటం ఉధృతం చేస్తామని ఆ ప్రకటనలో హెచ్చరించారు.

ఎంపీడీఓకు బీఆర్ఎస్ నాయకుల సన్మానం



నవతెలంగాణ-తలమడుగు

మండలానికి కొత్తగా బదిలీపై వచ్చిన ఎంపీడీఓ శేఖర్, ఎంపీఓ వినోద్‌ను బీఆర్ఎస్ నాయకులు మంగళవారం కార్యాలయంలో సన్మానించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ అధికార ప్రతినిధి కిరణ్ కుమార్ మాట్లాడుతూ మండలానికి కొత్తగా బదిలీపై వచ్చిన అధికారులను మర్యాదపూర్వకంగా సన్మానించామన్నారు. అధికారులైన, నాయకులైన ప్రజలకు సేవ చేస్తేనే గుర్తింపు ఉంటుందని తెలిపారు. అధికారులు మండల ప్రజలకు మంచి సేవలు అందించి వారి గుండెల్లో స్థిరస్థాయిగా నిలిచిపోవాలన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ తోట వెంకటేష్, పార్టీ సీనియర్ నాయకులు కాటిపల్లి శ్రీనివాస్‌రెడ్డి, అబ్దుల్లా, తాంసి నాగారెడ్డి, మేకల రవికాంత్ యాదవ్, అభిరామ్‌రెడ్డి పాల్గొన్నారు.

ముగిసిన టెక్నికల్ సర్టిఫికెట్ కోర్స్ పరీక్షలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

టైలరింగ్ డ్రాయింగ్ టెక్నికల్ సర్టిఫికెట్ కోర్స్ పరీక్షలు ప్రశాంతంగా ముగిసినట్లు నిర్మల్ జిల్లా విద్యాశాఖ అధికారి డా. ఎ.రవీందర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. టెక్నికల్ సర్టిఫికెట్ కోర్స్ పరీక్షలు, టైలరింగ్ అండ్ ఎంబ్రాయిడరీ లోయర్, హయ్యర్ పరీక్షలు, డ్రాయింగ్ లోయర్ హయ్యర్ పరీక్షలు ఈ నెల 24 నుండి 27 వరకు నిర్వహించడం జరిగిందని పేర్కొన్నారు. డ్రాయింగ్ లోయర్, హయ్యర్ పరీక్షలు 24 నుండి 27 వరకు నాలుగు రోజుల పాటు, టైలరింగ్, ఎంబ్రాయిడరీ లోయర్ పరీక్షలు ఈ నెల 25న(ఒక రోజు) టైలరింగ్, ఎంబ్రాయిడరీ హయ్యర్ పరీక్షలు ఈనెల 26 నుండి 27 వరకు రెండు రోజుల పాటు నిర్ణయించిన కేంద్రాలలో జరిగినట్లు పరీక్షల సహాయ కమిషనర్ పద్మ పేర్కొన్నారు.

బీడీ కార్మికుల ఉపాధి, భద్రత కోసం పోరాడాలి

- ఐఎఫ్‌టీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్



నవతెలంగాణ-భైంసా

బీడీ కార్మికుల ఉపాధి, భద్రత కోసం ఉద్యమించాలని ఐఎఫ్‌టియు జాతీయ ప్రధాన కార్యదర్శి టి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ స్వర్ణోత్సవ సంవత్సర ముగింపు సందర్భంగా పట్టణంలోని కెఎస్ గార్డెన్‌లో రాష్ట్ర అధ్యక్షులు సిఎస్ భూమేశ్వర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత బీడీ పరిశ్రమను దెబ్బతీయడానికి అనేక కుట్రలు చేస్తున్నారని తెలిపారు. కోప్టా చట్టం పేరుతో బీడీ పరిశ్రమను దెబ్బతీస్తోందని విమర్శించారు. బీడీ కార్మికులకు ప్రత్యామ్నాయ ఉపాధి చూపించాలని, లేనిచో కార్మికుల కోపాగ్నికి బలికాక తప్పదని నరేంద్ర మోడీ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. మోడీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక చట్టాలను తెచ్చి కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను హరిస్తోందని, దేశంలో 40కోట్ల మంది కార్మికులకు పియఫ్, ఈఎస్ఐ చట్టాలు అమలు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల్లో మోడీ, రేవంత్‌రెడ్డి ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీడీ కార్మికులకు రూ.4000 జీవన భృతిని వెంటనే అమలు చేయాలని రేవంత్‌రెడ్డిని కోరారు. ఈ సభలో రాష్ట్ర గౌరవ అధ్యక్షులు బి.భూమన్న, ప్రధాన కార్యదర్శి బి సూర్యశివాజీ, వర్కింగ్ ప్రెసిడెంట్ హరిత, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు అరుణ మాట్లాడుతూ 50 సంవత్సరాల నుండి బీడీ కార్మికులకు ఆకు, తంబాకు, బట్వాడా శ్రమ దోపిడీ, వేధింపులకు వ్యతిరేకంగా పోరాడిన చరిత్ర యూనియన్‌కు ఉందని తెలిపారు. జీవన భృతి అమలు కోసం ఆందోళన చేసి కార్మికుల పక్షాన నిలబడ్డామని తెలిపారు. సమావేశంలో సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి రాజు, యూనియన్ రాష్ట్ర నాయకులు ఖాజా మొయినుద్దీన్, సునాకారి రాజేష్, రాష్ట్ర నాయకులు సుప్రియ, గంగాధర్, అరుణ, ఐఎఫ్టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు దాసు, వెంకట్‌నారాయణ, అరుణోదయ రాష్ట్ర ఉపాధ్యక్షులు అబ్దుల్, రాష్ట్ర కోశాధికారి మల్లన్న, జ్యోతి, రంజిత్, పొశెట్టి పాల్గొన్నారు.

కక్ష సాధింపు కోసమే రైస్‌మిల్లుపై దాడి



నవతెలంగాణ - సిర్పూర్(టి)

మండలంలోని వెంకట్రావ్‌పేట్ గ్రామ సమీపంలోని శ్రీ సాయి బాలాజీ అగ్రోటెక్ రైస్‌మిల్లును సోమవారం ఎన్‌ఫోర్స్‌మెంట్, విజిలెన్స్ అధికారులు తాళాలు పగులగొట్టి వరిధాన్యం బస్తాలు సోదాలు చేసిన విషయం తెలిసిందే. ఇదంతా ఇద్దరు డీటీలు శ్రీనివాస్, రాజ్‌కుమార్ కక్ష సాధింపు కోసమేనని, పైఅధికారులకు తప్పుడు సమాచారం ఇచ్చి లేనిపోని ఆరోపణలు చేసి రాద్ధాంతం చేస్తున్నారని రైస్‌మిల్లు యజమానులు శివకుమార్, మనీష్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. మిల్లులో పని చేసే కార్మికులు ఊరికి వెళ్తామని చెప్పడంతో ఐదు రోజులు సెలవులు ప్రకటించామన్నారు. ప్రతినెల జరిగే పీవీఆర్‌లో వరిధాన్యం బస్తాలు ఎలాంటి అవకతవకలు లేకుండా ఉన్నాయని, సంతకం చేసిన వారు ఈ నెల 23న తమకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా సీల్ వేశారని పేర్కొన్నారు. 26న కూడా సమాచారం ఇవ్వకుండా సీల్ తీసి రైస్‌మిల్లు తాళాలు పగులగొట్టి సోదాలు నిర్వహించారన్నారు. గత రబీ సీజన్‌లో వడ్లు ప్రభుత్వం కేటాయించిన వాటికంటే ఎక్కువగా తీసుకోమని చెప్పిన వారు ఈ రోజు మాపై లేనిపోని నిందలు మోపడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. 16 వేల బస్తాలు తేడా ఉన్నాయని చెప్పి అధికారులను తప్పుదోవ పట్టించారని పేర్కొన్నారు. డీటీలు రూ.2.80లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేయగా, అంతలేవని చెప్పి రూ.80 వేలు ఇచ్చామని, దీనికి సాక్ష్యం ఉందని పేర్కొన్నారు. దాడులకు నిరసనగా హైకోర్టులో కేసు వేశామని, న్యాయం తమవైపే ఉందన్నారు.

డిగ్రీ కళాశాలలో మాక్ పార్లమెంట్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పార్లమెంట్ వ్యవస్థపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు మాక్ పార్లమెంట్ నిర్వహించామని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జలగం అనిత తెలిపారు. మంగళవారం కళాశాలలో నిర్వహించిన మాక్ పార్లమెంట్‌లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. స్పీకర్, వివిధ శాఖల మంత్రులు ఏ విధంగా శాఖలు, ప్రజా సమస్యలపై గళం విప్పుతారో అలాగే సెటప్ చేశారు. విద్యార్థులు సైతం మంచి ప్రతిభను కనబర్చారు. ఇందులో అధ్యక్షురాలిగా కె.శృతిక, ప్రధానమంత్రిగా మీర్జా సోహెబ్ భేగ్, లీడర్ ఆఫ్ అపోజిషన్‌గా ఆర్యన్, స్పీకర్‌గా ఎం.విట్టల్ వ్యవహరించారు. విద్యార్థులు స్పీకర్, అధికార, ప్రతిపక్ష నాయకుల పాత్రలు పోషిస్తూ పార్లమెంట్‌ను తలపించేలా ప్రశ్నల వర్షం కురిపించారు. ప్రతిపక్ష నేతలు పాలక వర్గాన్ని పథకాల అమలుపై నిలదీశారు. రాష్ట్రపతి స్వాగతం, స్పీచ్, వీడ్కోలు సందర్భంగా జాతీయ గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ అనిత మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో పార్లమెంట్ వ్యవస్థ ఎంత కీలకమన్న విషయన్ని విద్యార్థులకు తెలియజేయడం జరిగిందన్నారు. విద్యార్థిదశ నుంచే ప్రభుత్వాల పనితీరు తెలుసుకునేలా యూత్ పార్లమెంట్‌ను నిర్వహించామన్నారు. దీని ద్వారా విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు బయటకు వస్తాయన్నారు. ప్రస్తుతం ఉన్న పాలకవర్గాలు, ప్రతిపక్షలు ఎలా వ్యవహరిస్తున్నాయనే అంశాలపై విద్యార్థులు చక్కగా ప్రదర్శించారని తెలిపారు.

రోడ్డు పనులకు భూమి పూజ



నవతెలంగాణ-బేల

మండలంలోని అవాల్‌పూర్ గ్రామంలో సీసీ రోడ్డు పనులకు మంగళవారం బ్లాక్ కాంగ్రెస్ నాయకులు సంజయ్‌గుండావార్ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన సాగిస్తోందన్నారు. కార్యక్రమంలో నాయకులు మినక నగేష్‌రెడ్డి, సుధాంరెడ్డి, గావండే ఘన్‌శ్యామ్, శంకర్ భోక్రే, భోయర్ శంకర్, ఇత్తడి సురేష్‌రెడ్డి పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
బుధవారం | ఫిబ్రవరి 28, 2024 | www.navatelangana.com

అంబులెన్సులో మహిళ ప్రసవం

నవతెలంగాణ-సిరికొండ

మండలంలోని చింతగూడ గ్రామానికి చెందిన రూపాదేవి మంగళవారం 108 అంబులెన్స్‌లో ప్రసవించింది. రూపాదేవి పురిటి నొప్పులతో బాధపడుతుండటంతో 108కి సమాచారం ఇవ్వడంతో సిబ్బంది అంబులెన్సులో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో పండంటి ఆడబిడ్డకు ప్రసవించింది. మెరుగైన వైద్యం కోసం ఇచ్చోడలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. తల్లి, బిడ్డ క్షేమంగా ఉన్నారని ఈఎంటీ సురేష్, పైలట్ గోపీనాథ్‌లు తెలిపారు.



గోల్డ్ మెడల్ సాధించిన రుచిత

నవతెలంగాణ-దిలావర్‌పూర్

మండల కేంద్రానికి చెందిన నామాయి రుచిత ఖేలో ఇండియా యూనివర్సిటీ 2024 అస్సాం జరిగిన 100 మీటర్ల హర్డిల్స్ ఆటల్లో బంగారు పతకం సాధించింది. ఆమె స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఎన్ఎస్ఎస్సీ బెంగుళూరు శిక్షణ కేంద్రంలో రాబర్ట్ బాబీ జార్జ్ కోచ్ శిక్షణలో ఇప్పటి వరకు 10 జాతీయ పథకాలు సాధించింది. బంగారు పతకం సాధించడంతో బాలిక తల్లిదండ్రులు ఆనందోత్సాహంలో మునిగితేలారు. గ్రామానికి చెందిన నాయకులు, అధికారులు ఆమెను అభినందించారు.



గతంకంటే మెరుగైన ఫలితాలు ఆశిస్తున్నాం

- నేటి నుంచి ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభం
- జిల్లాలో 30 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- హాజరుకానున్న 21,527 మంది విద్యార్థులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు నేటి నుంచి ప్రారంభమవుతున్న సందర్భంగా అధికారులు పరీక్షలకు సంబంధించిన ఏర్పాట్లను పూర్తి చేశారు. పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో గత సంవత్సరం కంటే కాస్త ముందుగానే ఈసారి టైంటేబుల్ సిద్ధమైంది. ప్రాక్టికల్ పరీక్షలతో పాటు, ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఇంగ్లీషు ప్రాక్టికల్ పరీక్ష, పర్యావరణ విద్య పరీక్షలు ముగిశాయి. థియరీ పరీక్షలపై జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ సమీక్ష నిర్వహించగా, జిల్లా ఇంటర్ విద్యాధికారి సైతం నిర్వాహకులకు అవగాహన కల్పించారు.

సీసీ నిఘాలో పరీక్షలు, నిమిషం నిబంధన అమలు..

నేటి నుంచి మార్చి 14 వరకు జరిగే ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల నిర్వహణకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. పరీక్షా కేంద్రాలను సీసీ కెమెరాలతో పర్యవేక్షించనున్నారు. నిమిషం నిబంధన ఈసారి కూడా కొనసాగుతుంది. ప్రతి పరీక్షా కేంద్రంలో అవసరమైన మెడికల్ సదుపాయాలతో పాటు వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచనున్నారు. వేసవి కాలం నేపథ్యంలో విద్యార్థులకు తాగునీటి సౌకర్యం, టాయిలెట్ సౌకర్యం, కింద కూర్చోకుండా ఫర్నిచర్ ఏర్పాట్లు చేశారు.

పరీక్ష రాసే విద్యార్థులు మొత్తం 21,527 మంది...

ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా 30 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా జిల్లాలోని ప్రభుత్వ, ప్రయివేట్ కాలేజీల్లో జనరల్, ఓకేషనల్ విద్యార్థులు మొత్తం 21,527 మంది పరీక్షలకు హాజరు కానున్నారు. వారిలో ఫస్టియర్ విద్యార్థులు 11,666 మంది, సెకండియర్ విద్యార్థులు 9,861 మంది ఉన్నారు. పరీక్ష ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఉండగా, విద్యార్థులను 8 గంటల నుంచి పరీక్ష కేంద్రంలోకి అనుమతించనున్నారు.

హాల్ టికెట్‌పై సంతకం లేకున్నా పరీక్ష రాయొచ్చు...

ప్రయివేట్ కళాశాలలు హాల్ టికెట్లు ఇవ్వని, విద్యార్థులు నేరుగా ఇంటర్‌నెట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఇందుకు సంబంధించిన ఆదేశాలను పరీక్షల నిర్వహణ కేంద్రాలకు ఉన్నతాధికారులు జారీ చేశారు. విద్యార్థులు టీఎస్‌బీఐఈ.సీజీజీ.గావ్.ఇన్ వెబ్‌సైట్ నుంచి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. హాల్ టికెట్ పై సంతకం లేకున్న పరిక్ష రాసే వీలు కల్పించారు.

పరీక్షల నిర్వహణకు అధికారుల నియామకం..

జిల్లాలో ఇంటర్ పరీక్షల కోసం అవసరమైన అధికారులకు విధులను కేటాయిస్తూ జిల్లా ఇంటర్మీడియట్ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ప్రతి సెంటర్‌కు ఒక సూపరింటెండెంట్ చొప్పున జిల్లాలో 30 మందిని నియమించారు. వారితో పాటు మరో 30 మంది డిపార్ట్‌మెంటల్ అధికారులు, ఇద్దరు ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, సిట్టింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేశారు. గ్రామాల నుంచి వచ్చే విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సులను ఏర్పాట్లు చేశారు.

అనుమతి వీటికి మాత్రమే..!

విద్యార్థులు తమ హాల్ టికెట్లను టీఎస్‌బీఐఈ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలి. పరీక్షా కేంద్రాలకు విద్యార్థులు గంట ముందుగానే చేరుకోవాలి. విద్యార్థితో హాల్ టికెట్, పెన్, పెన్సిల్, రబ్బర్, ఎగ్జామ్ ప్యాడ్, మ్యాథమెటికల్ పరికరాలు మాత్రమే పరీక్షా కేంద్రంలోకి అనుమతిస్తారు. నోటు బుక్కులు, సెల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలకు పరీక్షా కేంద్రాల్లోకి అనుమతి లేదని అధికారులు స్పష్టం చేశారు.

పరీక్షల టైం టేబుల్ ఇదే..!

ఇంటర్మీడియట్ పరీక్షలకు గాను టైంటేబుల్ ఈ విధంగా ఉంది. ఫిబ్రవరి 28న లాంగ్వేజ్ పేపర్ -1, 29న లాంగ్వేజ్ పేపర్-2, మార్చి 1న ఇంగ్లీషు - 1, 2న ఇంగ్లీషు-2, 4న మ్యాథమెటిక్స్-ఏ, బాటనీ, పొలిటికల్ సైన్స్ పేపర్-1, 5న మ్యాథమెటిక్స్-ఏ, జువాలజీ, పొలిటికల్ సైన్స్ పేపర్-2, 6న మ్యాథమెటిక్స్-బి, బాటనీ, పొలిటికల్ సైన్స్ పేపర్-1, 7న మ్యాథమెటిక్స్-బి, జువాలజీ, పొలిటికల్ సైన్స్ పేపర్-2, 11న ఫిజిక్స్, ఎకనామిక్స్ పేపర్-1, 12న ఫిజిక్స్, ఎకనామిక్స్ పేపర్-2, 13న కెమిస్ట్రీ, కామర్స్ పేపర్-1, 14న కెమిస్ట్రీ, కామర్స్ పేపర్-2 పరీక్షలు నిర్వహిస్తారు.

గతం కంటే ఈసారి మెరుగైన ఫలితాలు వస్తాయి

పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. ఇంటర్‌నెట్ ద్వారా హాల్ టికెట్ పొందిన విద్యార్థులను పరీక్ష కేంద్రంలోకి అనుమతించేలా బోర్డు నిర్ణయం తీసుకున్నది. బోర్డు నిబంధనల ప్రకారం నిర్ణీత సమయానికి ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్ష కేంద్రంలోకి అనుమతించరు. మాస్ కాపీయింగ్ జరుగకుండా చర్యలు తీసుకుంటున్నాం. విద్యార్థులు ఎలాంటి భయం లేకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయాలి. గతంలో కంటే ఈసారి మరింత మెరుగైన ఫలితాలు వస్తాయని ఆశిస్తున్నాం.

ఆదిలాబాద్ ఇంటర్ బోర్డు విద్యాధికారి రవీందర్ కుమార్





ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఐఈఓ రవీందర్ కుమార్



డీఎస్పీని కలిసిన సీపీఐ(ఎం) బృందం



నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

ఆదిలాబాద్ డీఎస్పీగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన జీవన్ రెడ్డిని సీపీఐ(ఎం) బృందం మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం పట్టణంలోని డీఎస్పీ కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా డీఎస్పీకి జిల్లాలో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్, సీనియర్ నాయకులు బండి దత్తాత్రి, జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు లంక రాఘవులు, పూసం సచిన్, జిల్లా కమిటీ సభ్యులు బొజ్జ ఆశన్న, జిల్లా నాయకులు అగ్గిమల్ల స్వామి, లింగాల చిన్నన్న పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన కాంగ్రెస్ జిల్లా నాయకులు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మార్కెట్, గిడ్డంగుల శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును జిల్లా కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. మంగళవారం హైదరాబాద్‌కు వెళ్లిన నాయకులు సచివాలయంలో కలిసి ఆదిలాబాద్ నియోజకవర్గంలో జరుగుతున్న రాజకీయ పరిణామాలను ఆయనకు వివరించారు. మంత్రిని కలిసిన వారిలో కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు మల్లేష్, కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ భూపెల్లి శ్రీధర్, యువజన కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్ రెడ్డి ఉన్నారు.

కిడ్నీ బాధితుడికి ఆర్థిక సాయం అందజేత



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న ఓ బాధితుడికి ఆదిలాబాద్ జోసెఫ్ కాన్వెంట్ హైస్కూల్ విద్యార్థులు ఆర్థిక సాయం చేసి అండగా నిలిచారు. బేల మండలంలోని సోన్‌కాస్ గ్రామానికి చెందిన అడే రాజారామ్‌కు కిడ్ని సమస్య ఉంది. విషయం తెలుసుకున్న కాన్వెంట్ హైస్కూల్ విద్యార్థులు బాధితుడికి అండగా నిలిచి మంగళవారం పాఠశాలలో రూ.50 వేల నగదు సాయం అందించారు. బాధితుడి భార్య మీరాకు ఇన్‌చార్జీ ప్రిన్సిపల్ సిస్టర్ లిజండో విద్యార్థులతో కలిసి నగదును ఇచ్చారు. దీంతో ఆ కుటుంబీకులు కన్నీరుమున్నీరయ్యారు. చదువుతో పాటు విద్యార్థులకు సామాజిక సేవ గురించి తెలియజేడానికి కార్యక్రమాలు చేపడుతున్నామని పాఠశాల ఇన్‌చార్జీ ప్రిన్సిపల్ సిస్టర్ లిజండో తెలిపారు. గత సంవత్సరం సమాజిక సేవ కోసం రూ.1.27లక్షలు జమ చేశామని అన్నారు. రూ.70 వేలను ఇటీవల అందించామన్నారు. ప్రస్తుతం రాజారామ్‌కు రూ.50వేలు అందించామని తెలిపారు.

ప్రతీ మహిళ పారిశ్రామిక వేత్తగా ఎదగాలి



నవతెలంగాణ-లక్ష్మణచాంద

తెలంగాణ గ్రామీణ బ్యాంకు వడ్యాల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం రుణ వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బ్యాంకు రీజినల్ మేనేజర్ రామారావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రీజినల్ మేనేజర్ మాట్లాడుతూ బ్యాంకు అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకొని, ప్రతీ మహిళ పారిశ్రామికవేత్తగా ఎదగాలని ఆకాంక్షించారు. పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని భావించే ప్రతీ ఒక్కరికి బ్యాంకు సిబ్బంది అందుబాటులో ఉండి సేవలు కొనసాగిస్తుంటారని పేర్కొన్నారు. బ్యాంకు ఖాతా కలిగిన వారికి భీమా సౌకర్యాం కల్పిస్తునట్టు తెలిపారు. అనంతరం పలువురికి బీమా చెక్కులు అందజేశారు. బీమా సౌకర్యంతో వినియోగదారులకు ఆర్థిక స్థిరత్వం, భరోసా కల్పిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ రాజశేఖర్‌రెడ్డి, ఫీల్డ్ ఆఫీసర్ అభిలాష్, సిబ్బంది శశికుమార్, ఆనంద్, ముత్యం, ఐకేపీ ఏపీఎం, సీసీలు, వీఓఏలు, మహిళలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు అండగా నిలవాలి



మార్కెట్ యార్డులో సోయాబీన్ కొనుగోళ్లను పరిశీలించిన బీఆర్ఎస్ నాయకులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

గత బీఆర్ఎస్ ప్రభుత్వం తరహాలో పండించిన ప్రతి గింజను కొనుగోలు చేసిందని, అదే తరహాలో కాంగ్రెస్ ప్రభుత్వం కూడా రైతులకు అండగా నిలవాలని బీఆర్ఎస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు జిల్లా కేంద్రంలో రైతుల నుంచి సోయాబీన్ కొంటున్నామని చెప్పడం పూర్తిగా అవస్తామని, బీఆర్ఎస్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ మెట్టు ప్రహ్లాద్ పేర్కొన్నారు. మంగళవారం జిల్లా మార్కెట్ యార్డులో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందుల దృష్ట్యా మార్కెట్ యార్డ్‌ను పరిశీలించారు. రైతులను కలిసి అక్కడి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అయన మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకులు అబద్ధపు మోసపూరిత మాటలు మాట్లాడటం పక్కనబెట్టి, రైతుల పండించిన సోయాబీన్‌ను ఎమ్మెస్పీ ద్వారా కొనుగోళ్లను ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతుల పక్షాన బీఆర్ఎస్ నేటి నుంచి ధర్నాలకు దిగుతామని హెచ్చరించారు. గత ప్రభుత్వం రైతుల పంటలకు ప్రోత్సాహాన్ని ఇస్తూనే వారు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేసిందన్నారు. అదే తరహాలో కాంగ్రెస్ ప్రభుత్వం కూడా రైతులకు అండగా నిలవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గండ్రత్ రమేష్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ కుమ్ర రాజు, జిల్లా సమన్వయ అధ్యక్షులు రోకండ్ల రమేష్, సేవ్వా జగదీష్, రాజన్న, పాల్గొన్నారు.

పార్టీలకు అతీతంగా ఐక్యతతో ఉండాలి

- ఆదివాసీ పురోహిత్ పర్ధాన్ సమాజ్ నాయకులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదివాసీ పర్ధాన్ సమాజ్‌కు రాజకీయంగా గుర్తింపు లభించడంతో పాటు వివిధ నామినేటెడ్ పదవులలో అవకాశాలు రావాలంటే అందరూ పార్టీలకు అతీతంగా ఐక్యతతో ఏకధాటిపై ఉండాలని ఆదివాసీ పురోహిత్ పర్ధాన్ సమాజ్ నాయకులు, హీరాసుక జయంతి ఉత్సవ కమిటీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దుర్వ నగేష్, పూసం ఆనంద్‌రావ్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆదివాసీ పురోహిత్ సమాజ్ సంఘ భవన స్థలంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా సోమవారం ఇంద్రవెల్లి మండల కేంద్రంలో నిర్వహించిన గోండి ధర్మగురు హీరాసుక జయంతి ఉత్సవాలను విజయవంతం అయినట్లు పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా హాజరైన ఆదివాసీ పర్ధాన్ కులస్తులు, ఆదివాసీ తొమ్మిది తెగల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కర్షకులు, కార్మికులు పెద్ద ఎత్తున హజరై విజయవంతం చేసినందుకు వారికి ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. ఇక ముందు కూడా ఆదివాసీ పర్ధాన్ సమాజ్ నిర్వహించే కార్యక్రమాలలో పెద్ద ఎత్తున పాల్గొని ఇదే ఐక్యతతో ముందుకు సాగాలన్నారు. సమాజాన్ని ఏకధాటిపైకి తీసుకువచ్చేందుకు తాము కృషి చేయడం జరుగుతుందన్నారు. దీనికి ప్రతి ఒక ఆదివాసీ పర్ధాన్ సమాజ్‌కు చెందిన వారు సహకరించి ప్రోత్సాహించాలన్నారు. ఆదివాసీ పర్ధాన్ సమాజ్‌కు గుర్తింపు లేకపోవడంతో ఆర్థికంగా, రాజకీయంగా, విద్య పరంగా ఏండ్లుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. సమాజ్ ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో పర్ధాన్ సమాజ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మడావి శంకర్, నాయకులు కుర్సేంగే యాదవ్ రావ్, గేడం మాధవ్, సెడ్మకి సుభాష్, గేడం జనార్ధన్, ఆర్క శేషరావ్, ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆదివాసీ పురోహిత్ పర్ధాన్ సమాజ్ నాయకులు

జాతీయ స్థాయి పోటీల్లో జిల్లా వాసికి కాంస్య పతకం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జాతీయస్థాయి ఖేలో ఇండియా వూషు పోటీల్లో జిల్లా వాసి కాంస్య పతకాన్ని సాధించింది. కోచ్ అన్నారపు వీరేష్ ఆధ్వర్యంలో కోచింగ్ తీసుకున్న బజార్‌హత్నూర్ మండల కేంద్రానికి చెందిన రాథోడ్ వనిత ఈనెల 25 నుంచి 27 వరకు రాంచీలో జరిగిన జాతీయస్థాయి ఖేలో ఇండియా పోటీల్లో పాల్గొన్నారు. గతంలో తమిళనాడులో జరిగిన సౌత్ జోన్ సెలక్షన్స్‌లో వెండి పతకం సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. తాజాగా జరిగిన పోటీల్లో రాథోడ్ వనిత 75 కేజీల వెయిట్ కేటగిరి ఉమెన్స్ లీగ్‌లో పాల్గొనగా మరో కాంస్య పతకాన్ని సాధించింది. దీంతో పతకం సాధించిన రాథోడ్ వనితను వూషు అసోసియేషన్ ఆఫ్ ఇండియా సీఈఓ సోహెల్ అహ్మద్, ఆమెచర్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ జనరల్ సెక్రటరీ అబ్దుల్ ఉమార్, కోచ్ అన్నారపు వీరేష్ పలువురు అభినందనలు తెలిపారు.

గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ-లక్ష్మణచాంద



ఇటీవల గుర్తు తెలియని దుండగులు తరుచు బైక్‌లకు నిప్పు పెడుతున్న దృష్ట్యా గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని ఏఎస్సై నారాయణ అన్నారు. మంగళవారం రాచాపూర్‌లో గ్రామస్తులకు అవగాహన కల్పించారు. అనుమానస్పదంగా ఎవరైనా కనిపిస్తే స్థానిక పోలీస్ స్టేషన్‌కు లేదా 100 కి సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

కేజీబీవీని తనిఖీ చేసిన సెక్టోరల్ అధికారి శ్రీదేవి

నవతెలంగాణ-కడెం

మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయాన్ని సెక్టోరల్ అధికారి శ్రీదేవి మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు పదో తరగతి విద్యార్థుల స్పెషల్ టెస్ట్‌కు సంబంధించిన జవాబు పత్రాలను సబ్జెక్టులవారిగా పరిశీలించి, సీఆర్టీలకు తగు సూచనలు చేశారు. పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థుల ప్రగతిని పరిశీలించారు. రాబోయే పరీక్షలపై అవగాహన కల్పించడంతో పాటు, విద్యార్థులకు ఉత్తమ మార్కులు సాధించుటకు అవసరమైనటువంటి సూచనలను చేశారు. ముఖ్యంగా పరీక్షలు అంటే భయపడవద్దని, ప్రణాళిక బద్ధంగా చదివితే పరీక్షలను సులువుగా రాయవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న సెక్టోరల్ అధికారి శ్రీదేవి

ఆస్పత్రిలో పాము కలకలం



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

మండలంలోని పిట్టబొంగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం పాము కలకలం రేపింది. మధ్యాహ్న సమయంలో డాక్టర్ గదిలో పాము కనిపించడంతో సిబ్బంది చూసి భయ పడ్డారు. డాక్టర్ గదిలో సుమారు అర గంట పాటు గోడ నుంచి కిటికీ వద్దకు వెళ్లేందుకు పాము నానా అవస్థలు పడింది. ఈ దృశ్యాన్ని సిబ్బంది వీడియో తీసి వైరల్ చేశారు.

ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

ఇంటర్మీడియట్ పరీక్షలకు అవసరమైన ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు. మండలంలో ఒకటి ప్రయివేట్ కళాశాలతో పాటు ప్రభుత్వ కళాశాల కలిపి మొత్తం రెండు కాలేజీలలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ కళాశాల కేంద్రంలో నేడు ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులు 307 మంది, ప్రయివేట్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం 183 మంది, సెకండ్ ఇయర్‌లో 268 మంది, ప్రయివేట్ కళాశాలకు చెందిన 196 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నట్లు ప్రిన్సిపాల్ ధనరాజ్ తెలిపారు. విద్యార్థులకు జంబ్లింగ్ పద్ధతిలో పరీక్ష రాయనున్నట్టు ఆయన తెలిపారు. పరీక్షకు 15 మంది ఇన్విజిలేటర్లతో పాటు ఒక సిట్టింగ్ స్క్వాడ్, ఒక డీఓ, సీఎస్‌ను నియమించినట్టు ఆయన తెలిపారు.

ఎమ్మెల్యేని కలిసిన రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు

నవతెలంగాణ-ఉట్నూర్

మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు కుమ్ర ఈశ్వరీబాయి మంగళవారం ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌ని మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందించి, శాలువాలతో సత్కరించారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కుమురంభీం ఆసిఫాబాద్
బుధవారం | ఫిబ్రవరి 28, 2024 | www.navatelangana.com

మురికి కాలువ ప్రారంభం

నవతెలంగాణ-బెజ్జూరు



మండలంలోని చిన్న సిద్దాపూర్ గ్రామంలో మురికి కాలువ నిర్మాణ పనులను మంగళవారం బీజేపీ నాయకులు పాల్వాయి శ్రావణ్, కొండ్ర మనోహర్‌గౌడ్ ప్రారంభించారు. ఎన్ఆర్ఈజీఎస్ పథకం కింద రూ.ఐదు లక్షలు ప్రభుత్వం మంజూరు చేయగా పనులను ప్రారంభించారు. వారం రోజుల్లో పనులు పూర్తిచేస్తామని ఈ సందర్భంగా వారు తెలిపారు. ఈ కాలువ నిర్మాణంతో గ్రామంలో మురికి కాలువ ఇబ్బందులు తొలుగుతాయన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రాజారాం, శ్రీనివాస్, బాలకృష్ణ, గోపాల్, భీంరావు, శ్రీను, రమేష్, బక్కన్న, హనుమంతు పాల్గొన్నారు.

బీఎస్ఎన్ఎల్ సిగ్నల్ వ్యవస్థను మెరుగుపర్చాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్



కుంరంభీం ఆసిఫాబాద్ జిల్లాలో బీఎస్ఎన్ఎల్ సిగ్నల్ వ్యవస్థను మెరుగుపర్చాలని సీపీఐ (ఎం) పట్టణ కార్యదర్శి ముంజం ఆనంద్‌కుమార్ డిమాండ్ చేశారు. బీఎస్ఎన్ఎల్ అధికారుల తీరు పట్ల మంగళవారం ఆయన స్థానిక బీఎస్ఎన్ల్ కార్యాలయం ముందు బైటాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిగ్నల్ వ్యవస్థ సరిగా లేకపోవడంతో వినియోగదారులు సెల్‌ఫోన్‌లు సరిగా పని చేయక ఇబ్బందులు పడుతున్నారని, అధికారులను అడిగితే సరైన సమాధానం చెప్పడం లేదని అన్నారు. ఇప్పటికైనా అధికారులు తమ పనితీరు మార్చుకొని సిగ్నల్ వ్యవస్థను మెరుగుపర్చాలని, లేనిపక్షంలో ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

నేటి నుంచి ఇంటర్మీడియట్ పరీక్షలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలు నేటి నుండి ప్రారంభం కానున్నాయి. జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే ఏర్పాటు చేసిన 19 కేంద్రాలలో మౌలిక వసతులు పూర్తి చేశారు. అయితే ప్రస్తుతం జరుగుతున్న పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని ఇంటర్మీడియట్ బోర్డ్ కమిషనర్ ఓజ, రాష్ట్ర ముఖ్య కార్యదర్శి శాంతికుమారి ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్లు ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు. దీనిలో భాగంగా పరీక్ష కేంద్రాల వద్ద గతంతో భిన్నంగా ఒక్కో కేంద్రం వద్ద ఒక రెవెన్యూ అధికారి సిట్టింగ్ స్క్వాడ్‌లా వ్యవహరించనున్నారు. జిల్లాలో మాస్ కాపీ జరగకుండా ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బందిని ఏర్పాటు చేశారు. గతంలో కూడా మూడు బృందాలను సిట్టింగ్ స్క్వాడ్ బృందాలుగా ఏర్పాటు చేసి ఒక్కో పరీక్షకు ఒక్కో కేంద్రాన్ని సందర్శించి అక్కడే ఉండేవారు. దానికి భిన్నంగా ప్రస్తుతం కలెక్టర్లు ప్రతిరోజు ఒక్కో సెంటర్‌కు ప్రత్యేకంగా ఒక్కో సిబ్బందిని సిట్టింగ్ స్క్వాడ్‌గా కేటాయించారు. దీంతో పేపర్ లీక్ కాకుండా చూడడంతో పాటు సెంటర్లో జరిగే ప్రతి విషయాన్ని అనుక్షణం తన దృష్టికి తీసుకువచ్చే విధంగా కలెక్టర్లు ఏర్పాట్లు చేసినట్లు తెలిసింది. జిల్లాలో 19 సెంటర్లలో మొత్తం 10423 విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు.

కౌటాల : ఇంటర్ మీడియట్ వార్షిక పరీక్షలు నేటి నుండి ప్రారంభం కానున్నాయి. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 735 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఇందులో మొదటి సంవత్సరం జనరల్ విద్యార్థులు 239 కాగా ఒకేషనల్ విద్యార్థులు 137 మంది ఉన్నారు. రెండవ సంవత్సరం జనరల్ విద్యార్థులు 229 మంది ఉండగా ఒకేషనల్ విద్యార్థులు 130 మంది ఉన్నారు. మొత్తం 735 మంది ఇంటర్ మీడియట్ విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఉదయం తొమ్మిది గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నట్టు, పరీక్షల కోసం అన్ని ఏర్పాట్లు చేసినట్టు కళాశాల సీఎస్ బాలకిషన్‌రావు తెలిపారు.

బెజ్జూరు : ఇంటర్ మీడియట్ పరీక్షల నిర్వహణ కోసం అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్టు ప్రిన్సిపాల్ రాజయ్య తెలిపారు. నేటి నుండి ఇంటర్ మీడియట్ పరీక్షలు ప్రారంభమవుతాయని, మొదటి సంవత్సరంలో 203 మంది విద్యార్థులు, రెండో సంవత్సరంలో 172 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్టు ఆయన పేర్కొన్నారు. చీఫ్ సూపరింటెండెంట్‌గా దుర్గం జ్ఞానేశ్వర్, డిపార్టుమెంట్ ఆఫీసర్‌గా ఆర్ గణపతిని ప్రభుత్వం ఇంటర్ మీడియట్ బోర్డుకు నియమించిందని తెలిపారు. ఇంటర్ పరీక్షలు ఉదయం తొమ్మిది గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు కొనసాగుతాయని, ఒక్క నిమిషం ఆలస్యమైన పరీక్ష కేంద్రానికి అనుమతించమని ఆయన తెలిపారు.

రెబ్బెన : ఇంటర్ పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ పరీక్షలు మార్చి 19వ తేదీతో ముగియనున్నట్టు చీఫ్ సూపరింటెండెంట్ ప్రకాష్, డిపార్టుమెంట్ ఆఫీసర్ మహేష్ తెలిపారు. మంగళవారం అధికారులతో నిర్వహించిన సమావేశంలో పాటించాల్సిన విధివిధానాల గురించి వివరించారు. సెంటర్‌లో ఏర్పాట్లు పూర్తిచేయడంతో పాటు మౌళిక వసతులు కల్పించినట్టు ఆయన వివరించారు. ఇంటర్ మీడియట్ ప్రథమ సంవత్సరంలో 566 మంది విద్యార్థులు, ద్వితీయ సంవత్సరంలో 485 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారన్నారు. పరీక్ష ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.



నిమిషం నిబంధన అమలు

పరీక్ష కేంద్రానికి గంట ముందుగానే చేరుకోవాలని చీఫ్ సూపరింటెండెంట్ ప్రకాష్, డిపార్టుమెంట్ ఆఫీసర్ మహేష్ అన్నారు. ఉదయం తొమ్మిది గంటల తర్వాత పరీక్ష కేంద్రంలోకి అనుమతి ఉండబోదని, ఈ విషయాన్ని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు గుర్తుంచుకోవాలని సూచించారు. నిమిషం ఆలస్యమైన పరీక్ష కేంద్రంలోకి అనుమతించబోమని ఆయన తెలిపారు.

వాంకిడి : మండలకేంద్రంలోని జూనియర్ కళాశాలలో నిర్వహించే ఇంటర్ మీడియట్ పరీక్షలకు సర్వం సిద్ధం చేసినట్టు కళాశాల ప్రిన్సిపాల్ సంపత్‌కుమార్ తెలిపారు. పరీక్ష సమయంలో విద్యార్థులు ఎవరు కూడా సెల్‌ఫోన్‌లు తీసుకురావొద్దని, సమయానికి ముందే పరీక్ష కేంద్రానికి హాజరుకావాలని తెలిపారు. ఒక్క నిమిషం ఆలస్యమైన పరీక్ష కేంద్రంలోకి విద్యార్థులకు అనుమతిలేదని, ముందుగానే విద్యార్థులు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని ఆయన కోరారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించడం జరిగిందన్నారు. ఇంటర్ మీడియట్ మొదటి సంవత్సరం 225 మంది విద్యార్థులు, ద్వితీయ సంవత్సరం 188 మంది విద్యార్థులు. మొత్తం 413 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నట్టు ఆయన తెలిపారు.

ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి



నవతెలంగాణ - కౌటాల

ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని ఎస్పీ కె సురేష్‌కుమార్ అన్నారు. మంగళవారం పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్‌లోని పలు రికార్డులను తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదులపై జాప్యం చేయరాదన్నారు. అసాంఘిక కార్యకలాపాలు జరుగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి గ్రామంలో నిఘా పెంచాలన్నారు. అవసరమైన ప్రతి చోట తప్పకుండా సీసీ కెమెరాలను ఏర్పాటుచేసి సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. ఆయా గ్రామాల ప్రజలకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. ఆర్థిక, సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేయాలన్నారు. పోలీస్‌స్టేషన్‌లోని రిసెప్షన్, లాకప్, మెస్ ద్వారక్, టెక్నికల్ గదులను ఆయన పరిశీలించారు. ఆయన వెంట డీఎస్పీ కరుణాకర్, సీఐ సాదిక్‌పాషా, ఎస్ఐ మధుకర్ ఉన్నారు.

పల్స్ పోలియోను విజయవంతం చేయాలి



నవతెలంగాణ-కెరమెరి

మార్చి 3నుంచి చేపట్టే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీహెచ్ఓ శ్రీనివాసరెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో ఏఎన్ఎం, ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీలకు శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నేషనల్ ఇమునైజేషన్ డేగా మార్చి 3న ఆదివారం ఈ పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. 0–5 ఐదు సంవత్సరాల వయసు గల పిల్లలందరికీ ఈ పల్స్ పోలియో చుక్కలు వేయించాలనిసూచించారు. మండలంలో ఈ పల్స్ పోలియో చుక్కలు వేసి పోలియో రహిత సమాజాన్ని నిర్మిద్దాం అన్నారు. మార్చి 3 నుంచి పోలింగ్ బూత్‌లలో, నాలుగు ఐదు తారీకులలో ఇంటింటికి తిరిగి ఈ పల్స్ పోలియో చుక్కలు వేసుకుని వారిని గుర్తించి 100 శాతం ఈ పల్స్ పోలియో చుక్కలు ఐదు సంవత్సరాల లోపు పిల్లలందరికీ వేయించాలాని సూచించారు. కార్యక్రమంలో ఫార్మాసిస్ట్ ఖాలీల్ హుస్సేన్, సూపర్ వైజర్ లక్ష్మీ కాంతం, ఎంఎల్ హెచ్ రాందాస్, భవానీ పాల్గొన్నారు.

ఒత్తిడి జయిస్తే పరీక్షల్లో విజయం సాధ్యం

- జిల్లా కలెక్టర్ హేమంత్ బొర్కడే

నవతెలంగాణ-ఆసిఫాబాద్



వార్షిక పరీక్షలలో ఎలాంటి ఒత్తిడి లేకుండా పరీక్షలు రాయాలని విద్యార్థులు ఒత్తిడి జయిస్తే విజయం సాధ్యమని ఆ విధంగా పరీక్షలు రాసేలా విద్యార్థులను సన్నద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ హేమంత్ బొర్కడే అన్నారు. మంగళవారం జాతీయ బాలల హక్కుల రక్షణ కమిషన్ ఆధ్వర్యంలో పరీక్ష పై ఏర్పాటు చేసిన చర్చ, శిక్షణ కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులతో ఏర్పాటు చేసిన సమావేశంలో కమిషన్ రాష్ట్ర బాధ్యులు దేవయ్యతో కలిసి పాల్గొన్నారు. ముందుగా కుమ్రంభీమ్ చిత్రపటానికి పూలమాలవేసి జ్యోతి ప్రజ్వలన చేసి అనంతరం ఆయన మాట్లాడుతూ 10వ తరగతి, ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు జరుగుతున్నందున ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పరీక్షలకు విద్యార్థులు ఎలాంటి ఒత్తిడి లకు లోను కాకుండా ప్రశాంతంగా హాజరయ్యే విధంగా చూడాలని అన్నారు. తల్లిదండ్రులు పరీక్షల సమయంలో విద్యార్థుల ఆరోగ్య, మానసిక స్థితిగతులను పర్యవేక్షించాలని, ఉపాధ్యాయులు విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను బోధించాలని అన్నారు. విద్యార్థులు వారికి నచ్చిన ఆటలు ఆడుకునే విధంగా స్వేచ్ఛ వాతావరణం కల్పించాలని, విద్యార్థుల పట్ల కోపాన్ని ప్రదర్శించకుండా ప్రేమగా మాట్లాడుతూ వారిని పరీక్షలకు ప్రోత్సహించాలని, ఉపాధ్యాయుల పట్ల విద్యార్థులు గౌరవభావాన్ని కలిగి ఉండేలా తయారు చేయాలని తెలిపారు. విద్యార్థులను పరీక్షలకు ప్రోత్సహిస్తే వారు మరింత పట్టుదలతో సన్నద్ధమవుతారని, విద్యార్థులలోని నైపుణ్యాన్ని గుర్తించి ఆ దిశగా వారిని ప్రోత్సహించడంతోపాటు దైవభక్తిని పెంపొందించాలని తెలిపారు. విద్యార్థుల హక్కులకు ఎలాంటి భంగం కలగకుండా చర్యలు తీసుకుంటూ పరీక్షలకు సిద్ధం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్, జిల్లా గిరిజన అభివద్ధి అధికారి రమాదేవి, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి శంకర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



విద్యార్థులు ఒత్తిడిని అధిగమిస్తే విజయం సాధ్యం

- ఆసిఫాబాద్ ఎస్పీ సురేష్‌కుమార్



నవతెలంగాణ-సిర్పూర్(టి)

విద్యార్థులు పక్కా ప్రణాళికతో ఒత్తిడిని అధిగమించినపుడే విజయం సాధ్యమవుతుందని ఆసిఫాబాద్ ఎస్పీ సురేష్‌కుమార్ అన్నారు. మంగళవారం మండలకేంద్రంలోని సాంఘీక సంక్షేమ బాలుర గురుకుల విద్యాలయంలో పోలీసులు మీకోసం కార్యక్రమంలో భాగంగా పరీక్షల్లో విజయం ఎలా సాధించాలో పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృషి, తపన, పట్టుదల, సమయపాలన విజయానికి ముఖ్య సూత్రాలవుతాయని, ఎక్కడో మారుమూల గ్రామంలో పుట్టిన తాను కనీసం బస్సు సౌకర్యం లేని ఊరు నుంచి మూడు కిలోమీటర్లు నడిచివెళ్లి చదివానని, ఆ పట్టుదలతో ఇప్పుడు జిల్లాకు ఎస్పీగా విధులు నిర్వహిస్తున్నానన్నారు. దీనంతటికి చదువే ప్రధాన కారణమని, చదువు జ్ఞానాన్ని పెంచుతుందని, ప్రతి ఒక్కరు గొప్ప సాధనకై ఆలోచన చేయాలన్నారు. మనం అనుకున్న లక్ష్యాన్ని సాధించడానికి ఒత్తిడిని అధిగమించి ముందుకెళ్లాలని, తనమీద తనకు నమ్మకం ఏర్పడినప్పుడే అనుకున్నది సాధించగలుగుతారని ఉద్బోధించారు. అనంతరం మండలంలోని సుమారు 700 మంది విద్యార్థులకు పరీక్ష సామగ్రి పరీక్ష ప్యాడు, కంపాక్స్‌బాక్సు, పెన్నులు అందించారు. కార్యక్రమంలో కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్, కౌటాల సీఐ సాదిక్‌పాషా, ఎస్ఐ దీకొండ రమేష్, ప్రిన్సిపాల్ పోలోజు బాలరాజు, సంగీత పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి



నవతెలంగాణ - కౌటాల

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నేత్రాసనం బిషప్‌ప్రిన్స్ ఆంథోని అన్నారు. సోమవారం రాత్రి మండల కేంద్రంలోని ఇన్ఫంట్ జీసెస్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల వార్షికోత్సవం ప్రధానోపాధ్యాయుడు తోమ్ థోమస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుమూల ప్రాంతాల్లోని విద్యార్థుల్లో ఎంతో ప్రతిభ దాగివుందని, బాగా చదివి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయాలన్నారు. సీఐ సాధిక్‌పాషా మాట్లాడుతూ మారుమూల ప్రాంతాల్లో మిషనరీ పాఠశాల యాజమాన్యం కార్పొరేట్ స్థాయి విద్యనందించడం ఎంతో అభినందనీయమన్నారు. తల్లిదండ్రులు వారి పిల్లల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. పిల్లలు ఏది అడిగినా ఇచ్చి వారు చెడుదారిలో వెళ్లకుండా చూడాలన్నారు. పిల్లలకు మోటార్ సైకిల్ ఇవ్వకూడదన్నారు. విద్యార్థులు బాగా చదివి తల్లిదండ్రులు పడుతున్న కష్టానికి ప్రతిఫలంగా మంచి ఉద్యోగం సాధించాలని తెలిపారు. అనంతరం సెయింట్ జోసెఫ్ పాఠశాలలో 44 సంవత్సరాల పాటు ఉద్యోగం చేసి ఇటీవల పదవి విరమణ పొందిన మాదాను వెరోనికను బిషప్‌ప్రిన్స్ ఆంథోని, ప్రధానోపాధ్యాయుడు తోమ్ థోమస్, ఆమె సహచర ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎస్ఐ మధుకర్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆర్థిక లావాదేవీలపై అవగాహన కలిగి ఉండాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



పొదుపు చేయడాన్ని ప్రతి ఒక్కరూ అలవాటుగా మార్చుకోవాలని, ప్రతి ఒక్కరూ బ్యాంకు ఖాతా కలిగి ఆర్థిక లావాదేవీలపై అవగాహన కలిగి ఉండాలని ఆసిఫాబాద్ కలెక్టర్ బొర్కాడే హేమంత్ అన్నారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మార్చి 2వ తేదీ వరకు నిర్వహిస్తున్న ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలలో భాగంగా మంగళవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ నుంచి అధికారులు, విద్యార్థులతో చేపట్టిన ర్యాలీని లీడ్ బ్యాంక్ మేనేజర్ హనుమంతరావుతో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలలో ఆర్థిక అభివద్ధికి పాటించవలసిన నియమాలను ప్రజలందరికీ అవగాహన కల్పించడం జరుగుతుందని అన్నారు. ప్రతి ఒక్కరూ పొదుపు చేయడానికి అలవాటు చేసుకోవాలని, బ్యాంకు ఖాతా నిర్వహణ, ఆర్థిక లావాదేవీలపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. అనంతరం సమీకృత కలెక్టరేట్‌లో కలెక్టర్ ఛాంబర్‌లో ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన కింద మంజూరైన రూ.2 లక్షల బీమా చెక్కును కౌటాల మండలం ముత్యంపేట గ్రామానికి చెందిన లబ్ధిదారు ఆడే మంజుల కు అందజేశారు. ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక పథకాలు, కార్యక్రమాలు చేపడుతోందని ఈ అవకాశాన్ని అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్, తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ముత్యంపేట శాఖ మేనేజర్ అజేష్ కుమార్ పాల్గొన్నారు.

29న ద్యానకేంద్ర వారోత్సవాలు

నవతెలంగాణ-వాంకిడి

మండలంలోని కిర్డీ గ్రామంలో పూలాజీబాబా ద్యానకేంద్ర 10వ వారోత్సవాన్ని ఈ నెల 29వ తేదీ నుంచి నిర్వహించనున్నట్టు ద్యాన మందిర నిర్వాహకులు తెలిపారు. 29వ తేదీ రాత్రి ఎనిమిది గంటల నుంచి గ్రంథ పూజ, ద్యానం, భజన కార్యక్రమాలు, అనంతరం వివిధ గ్రామాల నుంచి వచ్చిన భజన బృందాలచే సామూహిక భజన కార్యక్రమాలు, మార్చి ఒకటో తేదీన ఉదయం 10 : 30 గంటలకు సిద్ధేశ్వర ముఖ్య సంస్థాపక అధ్యక్షుడు, పూలాజీబాబా కుమారుడు కేశవరావు చేతులమీదుగా ధ్వజారోహణం, భక్తి ప్రవచనలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ద్యాన మందిర కమిటీ సభ్యులు కోరారు.

పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జాతీయ ఆరోగ్య మిషన్‌లో భాగంగా జిల్లాలో ఒప్పంద, పొరుగు సేవల ప్రాతిపదికన 64 పోస్టుల నియామకం కొరకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థులు దరఖాస్తు ఫారం, మార్గదర్శకాల కొరకు జిల్లా వెబ్ సైట్ ఆసిఫాబాద్.తెలంగాణ.జీఓవీ.ఇన్‌లో సంప్రదించాలని, పూర్తి చేసిన దరఖాస్తుకు సంబంధిత ధ్రువపత్రాల నకలు ప్రతులను జతపరిచి స్వయంగా లేదా రిజిస్టర్ పోస్టు ద్వారా స్వయం ధ్రువీకతం చేసి ఈ నెల 28 నుండి మార్చి 11వ తేదీ వరకు కార్యాలయ పని వేళలలో జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్‌లో గల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో అందజేయాలని, ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

కంటి వైద్య శిబిరానికి స్పందన

నవతెలంగాణ-కాగజ్‌నగర్

శ్రీ కొత్తపల్లి వెంకటలక్ష్మి చంద్రయ్య మెమోరియల్ సర్వీసు సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక కిమ్స్ ఆసుపత్రిలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. ఈ శిబిరంలో 37 మందికి పరీక్షలు నిర్వహించగా ఇందులో 14 మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. వీరికి లయన్స్ క్లబ్ ఆఫ్ బెల్లంపల్లి వారి సహకారంతో ఉచితంగా ఆపరేషన్లు చేయించనున్నట్లు సొసైటీ వ్యవస్థాపకులు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్, అనిత తెలిపారు. ప్రతీ మంగళవారం నిర్వహించే ఈ కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు.



సీసీ రోడ్డు పనులు ప్రారంభం



నవతెలంగాణ-పెంచికల్‌పేట్

మండలంలోని కొండపెల్లి గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బొయిరె బండు మంగళవారం ప్రారంభించారు. కొండపెల్లి గ్రామంలో ఉపాధిహామీ చట్టంలో భాగంగా సీసీ రోడ్డు పనులు చేపడుతున్నట్టు ఆయన తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఎలుకరి లచ్చన్న, శంకరయ్య, రాజయ్య, జగన్నాథ్, లచ్చన్న పాల్గొన్నారు.

ఇంటర్నల్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు

నవతెలంగాణ-మందమర్రి



సింగరేణిలో ఇంటర్నల్ ఉద్యోగాలకు అధికారులు ఇంటర్వ్యూలను నిర్వహించారు. మంగళవారం మందమర్రి జీఎం కార్యాలయంలో ఆఫీస్ అటెండెంట్ టీ అండ్ ఎస్ గ్రేడ్ హెచ్ ఇంటర్నల్ ఉద్యోగాలకు నిర్వహించిన 2 ఉద్యోగాల ఇంటర్వ్యూ లకు 33 మంది దరఖాస్తు చేసుకోగా 30 మంది ఉద్యోగులు హాజరయ్యారు. రికార్డ్ అసిస్టెంట్ టీ అండ్ ఎస్ గ్రేడ్ ఈ ఇంటర్నల్ 2- ద్యోగాలకు గాను 4-దరఖాస్తు రాగా 4 గురు ఉద్యోగులు హాజరయ్యారు. ఈ ఉద్యోగాలకు సెలక్షన్ కమిటీ సభ్యులుగా ఎస్ఓటు జీఎం రాజేశ్వర్ రెడ్డి, డీజీఎం ఐడి రాజన్న, పర్సనల్ మేనేజర్ ఎస్ శ్యాంసుందర్, డీవైపీఎం సత్యబోస్ పాల్గొన్నారు.

నిరుపేద యువతి వివాహానికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-రామకృష్ణాపూర్



పట్టణంలోని స్థానిక కాకాతీయ కాలనీలో నివాసం ఉంటున్న నిరుపేద కుటుంబానికి చెందిన భారతి భీమక్క విద్యాధర్‌ల కుమార్తె నీలవేణీ వివాహానికి యువత జనం కోసం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం ఆర్థిక సాయం అందజేశారు. క్యాతనపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ జంగం కళ, తవక్కల్ విద్యా సంస్థల అధినేత అబ్దుల్ అజీజ్ చేతుల మీదుగా రూ.10,000 ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో యువత జనం కోసం స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు ఎర్రబెల్లి రాజేష్, ఉపాధ్యక్షుడు వెరైటీ తిరుపతి, ప్రధాన కార్యదర్శి జంగపల్లి మల్లయ్య, యువ నాయకులు బింగి శివకిరణ్, పలిగిరి కనక రాజు, కళ్యాణ్, ఆర్నె సతీష్, గిర్ని మల్లేష్, సత్యపాల్ పాల్గొన్నారు.

ఎట్టకేలకు 'రూట్' క్లియర్

- పూర్తి యాక్సెస్ కంట్రోల్డ్ జాతీయ రహదారిగా నిర్మాణం
- ఆర్మూరు-మంచిర్యాల మధ్య 4 వరసల రోడ్డు



నవతెలంగాణ-లక్సెట్టిపేట

వివాదాలు.. ఉద్యమాలు.. వ్యతిరేకతలతో ముందుకు సాగని నాలుగు వరుసల జాతీయ రహదారి పనులు ఎట్టకేలకు కొలిక్కి వచ్చింది. భూసేకరణ విషయంలో రైతులు సుముఖత చూపక పోవడం.. స్థానికులు వ్యతిరేకించడంతో రెండు సార్లు రద్దు అయిన ప్రక్రియ మూడవ సారి టెండర్ల ప్రక్రియ పూర్తి చేసుకుని నిర్మాణానికి సిద్ధమవుతోంది. ఇది రాష్ట్రంలో మరో ఎక్స్‌ప్రెస్ హైవే తరహాలో పూర్తి యాక్సెస్ కంట్రోల్డ్ హైవేగా రూపుదిద్దుకోబోతోంది. 131.8 కీ.మీ మేర నిర్మించే నాలుగు వరసల రహదారిలో 46 వంతెనలతో పాటు ఆర్ఓబీలు, అండర్‌పాస్‌లు ఉండనున్నాయి. ఈ ప్రాజెక్టుకు రూ.3,850 కోట్లు ఖర్చు చేస్తున్నారు. ఈ మేరకు లక్షెటిపేట తహసిల్దార్ రాఘవేంద్రరావు, ఎన్‌హెచ్ఎఐ సభ్యులు సత్యనారాయణ, ఇంతియాజ్ అలీ, మున్సిపల్ వైస్ చైర్మన్ ప్రొడక్ట్ శ్రీనివాస్ గౌడ్, కౌన్సిలర్ చాతరాజు రాజన్న, పెట్టను తిరుపతి అధికారులు రైతులు, స్థానికులతో జరిపిన చర్యలు సఫలీకృతమయ్యాయి. దీంతో రోడ్డు నిర్మాణానికి రూట్ క్లియర్ అయినట్లు అయింది.

ప్రమాదాలు తగ్గే అవకాశం

నిజామాబాద్-ఛత్తీస్‌గఢ్‌లోని జగ్దల్‌పూర్ ఎన్‌హెచ్ 63పై ట్రక్కులు ఎక్కువగా తిరుగుతుంటాయి. రెండు వరుసలతో ఇరుగ్గా ఉన్న రోడ్డు ప్రమాదాలకు నిలయంగా మారటంతో 4 వరసలకు విస్తరించాలని కేంద్రం గతంలో నిర్ణయించింది. ఇందులో నిజామాబాద్ నుంచి ఆర్మూరు శివారులోని హైవే 44 వరకు, తిరిగి మంచిర్యాల దాటిన తర్వాత ఉండే హైవే 363 నుంచి ఛత్తీస్‌గఢ్ సరిహద్దు చెన్నూరు వరకు రాష్ట్ర ప్రభుత్వ ఆదీనంలోని హైవేల విభాగం విస్తరిస్తుంది. ఆర్మూరు నుంచి మంచిర్యాల వరకు కీలక నిర్మాణం అయినందున దాన్ని జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ)కు అప్పగించారు. రాష్ట్ర విభాగం ఇప్పటికే ఆ రోడ్డును అవసరమైన ప్రాంతాల్లో 4 వరసలుగా మార్చడం, మిగతా చోట్ల మెరుగుపరుస్తోంది. అయితే ఎన్‌హెచ్ఏఐకి అప్పగించిన ఆర్మూరు-మంచిర్యాల రోడ్డు పట్టణాలు, గ్రామాల మీదుగా సాగుతున్నందున దాన్ని పూర్తి గ్రీన్‌ఫీల్డ్ హైవేగా మార్చాలని భావించారు.

నో డైరెక్ట్ క్రాసింగ్

ఆర్మూరు-మంచిర్యాల రోడ్డు మెట్‌పల్లి, కోరుట్ల, జగిత్యాల, లక్సెట్టిపేటల మీదుగా సాగుతుంది. ఈ మార్గంలో 100 కి.మీ మేర బైపాస్‌లే ఉండనున్నందున ఈ రోడ్డు దాదాపు కొత్త గ్రీన్‌ఫీల్డ్ హైవే తరహాలోనే ఉండనుంది. ఆయా పట్టణాల వద్ద 6 కి.మీ. నుంచి 12 కి.మీ. మేర భారీ బైపాస్‌లు ఉంటాయి.

200లోపు యూనిట్లు వాడిన వారికే 'గృహజ్యోతి'

- ప్రజాపాలనలో అందిన ధరఖాస్తులపై శాఖ పరమైన కసరత్తు



నవతెలంగాణ-జైపూర్

కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ప్రకటించిన ఆరు గ్యారంటీల్లో ఒకటైన గృహజ్యోతి పథకం ద్వార 200 యూనిట్ల విద్యుత్ వినియోగించుకున్న వారే అర్హులు.. వీరికి సంబంధించి విద్యుత్ బిల్లులు ప్రభుత్వం బరిస్తుండగా 200 యూనిట్లకు మించి ఒక్క యూనిట్ ఎక్కువగా విద్యుత్ వినియోగించుకుంటే మొత్తం బిల్లును వినియోగదారుడే చెల్లించాల్సివుంటుంది. ప్రజాపాలన ద్వార ఆరు గ్యారంటీలను ఏకరూప ధరఖాస్తుల ద్వార సేకరించిన గ్రామ పంచాయతీల వారిగా సమాచారం సేకరించిన ప్రభుత్వం గృహజ్యోతి పథకం అమలు వైపు అడుగులు వేస్తుంది. ఈ సంధర్భంగా ప్రజాపాలనలో అందిన ధరఖాస్తులపై విద్యుత్ శాఖ లబ్ధిదారుల గుర్తింపుపై దృష్టి సారించింది. గృహజ్యోతి అమలుపై ప్రభుత్వం తీసుకోనున్న నిర్ణయాలను మండల, గ్రామ స్థాయి విద్యుత్ ఉద్యోగులకు సూచనప్రాయంగా అప్రమత్తం చేసింది. ప్రజాపాలన ద్వార ధరఖాస్తులు చేసుకున్న వారు రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, సెల్ నెంబర్‌తో పాటు విద్యుత్ కనెక్షన్ వివరాలు పొందుపర్చాల్సి ఉంటుంది. ఈ విధంగా పూర్తి సమాచారంతో పాటు నిర్దేషిత యూనిట్ల విద్యుత్‌ను వినియోగించుకున్నప్పుడే గృహజ్యోతికి అర్హుడుగా పేర్కొంది. ఒకవేళ ధరఖాస్తులో అన్ని వివరాలు పొందుపర్చి విద్యుత్ కనెక్షన్ నెంబర్ వివరాలు ఇవ్వకుంటే మొదటి దశలో గృహజ్యోతి పథకం లబ్ధిదారులుగా గుర్తించబడరు. ఇలాంటి వారు వెంటనే స్థానిక మండల తహసీల్దార్ లేదా మండల పరిషత్ కార్యాలయంలో మళ్లీ ధరఖాస్తు చేసుకోవల్సివుంటుంది.. వారం రోజుల వ్యవధితో అర్హులైన వారందరికి సమాచారం ఇవ్వడం గృహజ్యోతి లబ్ధిదారులుగా గుర్తించడం జరుగుతుంది. ఈ మధ్య కాలంలో అర్హులైన వారు విద్యుత్ బిల్లు చెల్లించాల్సిన అవసరం లేదు. తదుపరి నెలలో బిల్లులు కొట్టే సమయంలో అర్హులుగా గుర్తించి బిల్లుల చెల్లింపు నుండి మినహాయింపు పొందవచ్చు. ఈ విషయంలో మండల పరిధిలో గల ట్రాన్స్‌కో ఏఈలు జాగ్రత్తలు తీసుకోవాలని ఉన్నతాధికారుల నుంచి ఇప్పటికే సమాచారం అందింది. అదేవిధంగా గృహజ్యోతి పథకం పంపిణీకి రెండు మూడు నెలల సమయం పట్టే అవకాశం ఉన్నందున వినియోగదారుల పట్ల సానుకూలంగా వ్యవహరించాలని విద్యుత్ శాఖ భావిస్తోంది. ఇంకా చెప్పాలంటే తెల్ల రేషన్‌కార్డులు కలిగివున్న ఎవరి సర్వీస్ నెంబర్‌ను అప్పటికప్పుడు తొలగించకుండా చూడటంతో పాటు ఒక వేల మొదటి లిస్టులో లబ్దిదారులుగా గుర్తించబడనప్పుడు తహసీల్దార్ కార్యాలయం ద్వార వారు అర్హులుగా గుర్తించే ఏర్పాటుకు సహకరించాలని భావిస్తోంది.

ముందస్తు చర్యలపై దృష్టి సారించిన విద్యుత్ శాఖ

ప్రభుత్వం ప్రకటించిన 200 యూనిట్ల విద్యుత్ వినియోగించుకునే క్రమంలో విద్యుత్ వినియోగం పెరిగే అవకాశం ఉన్నట్లు విద్యుత్ శాఖ భావిస్తోంది. 200 యూనిట్లు ఖర్చు చేయనివారు కూడా 200 యూనిట్లు ఖర్చు చేసే అవకాశం ఉన్నందున డీటీఆర్, పీటీఆర్‌లపై లోడ్ పెరిగే అవకాశం ఉంది. ఈ క్రమంలో రోజు వారిగా లోడ్ పెరుగుదలను గుణిస్తూ ఓవర్ లోడ్‌ను సమన్వయపర్చుకోవడం అవసరమని శాఖ భావిస్తోంది. ఈ విషయంలో స్థానిక అధికారులు ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలని ఇప్పటికే ఆదేశాలు జారీ చేసినట్లు తెలుస్తోంది. ఓవర్‌లోడ్ ఉన్న డీటీఆర్‌లకు ప్రయార్టీ ప్రకారం మార్చి 31 లోపు చార్జ్ చేయ్యడం, ప్రధానంగా డీటీఆర్ లోడ్ మానిటర్ చేయడం అవసరమని విద్యుత్ శాఖ అందుకు తగ్గట్టుగా చర్యలు చేపట్టేందుకు సిద్ధమవుతోంది. కాగా గృహజ్యోతి ద్వార 200 యూనిట్ల విద్యుత్ వినియోగించుకును వారు విద్యుత్ బకాయిలు పూర్తిగా చెల్లించాలని టీఎస్ ట్రాన్స్ కోరుతోంది.

'కౌన్సిలర్ భర్త భూ కబ్జాలు'

- చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్న అధికారులు



నవతెలంగాణ-రామకృష్ణాపూర్

క్యాతనపల్లి మున్సిపాలిటీ 3వ వార్డు కౌన్సిలర్ భర్త మున్సిపల్ పరిధిలోని ఖాళీ స్థలాలను కబ్జాలు చేస్తున్నాడని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఆర్కే-4 గడ్డ సమీపంలోని మున్సిపల్ పరిధిలోని ఖాళీ స్థలంలో గత సంవత్సరం తనకున్న పలుకుబడితో ఇంటి నిర్మాణం చేశారని, అంతటితో ఆగకుండా తిరిగి అదే స్థలానికి అనుకుని ఉన్నా మరి కొంత స్థలాన్ని ఇటీవల ఆక్రమించుకున్నారని, ఇదేంటి అని ప్రశ్నించిన తనకేం పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజలకు మంచి చేస్తారని గెలిపిస్తే తన ఆస్తులను పెంచుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా తన ఇంటికి సమీపంలోనే స్థానికుల నీటి అవసరాల కోసం ఏర్పాటు చేసిన బోర్వెల్‌ను తన సొంత అవసరాలకు వేసినట్లుగా తన ఇంటికి అవసరాలకు వాడుకుంటున్నాడని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ వ్యవహారంపై మున్సిపల్ అధికారులు చూసి చూడనట్టు ఉండడంతో మున్సిపల్ అధికారులకు ముడుపులు చెల్లించి ఆక్రమిస్తున్నాడనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఇప్పటికైనా ఈ వ్యవహారంపై అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం

నవతెలంగాణ-మందమర్రి

ఇంటర్ వార్షిక పరీక్షల నిర్వహణకు సర్వం సిద్ధమయ్యింది. ఇంటర్మీడియట్ పరీక్షలు బుధవారం నుంచి వచ్చే నెల 16వ తేదీ వరకు కొనసాగనున్నాయి. మండలంలో ప్రభుత్వ జూనియర్, కస్తూరిబా, మహాత్మ జ్యోతిబా పూలే, ఆర్కేపీ గురుకుల, మోడల్ స్కూల్, కార్మెల్, సింగరేణి మహిళా జూనియర్ కళాశాలలు ఉండగా వీటి కోసం మందమర్రిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, మోడల్ స్కూల్‌లను పరీక్షా కేంద్రాలుగా ఏర్పాటు చేసారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల చీఫ్ సూపరింటెండెంట్ కృష్ణయ్య, మోడల్ స్కూల్ చీఫ్ సూపరింటెండెంట్ జయకృష్ణలు మాట్లాడుతూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు ఉంటాయని రేపు జరుగబోయే మొదటి పరీక్షకు మోడల్ స్కూల్‌లో 289, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 322 మందిని కేటాయించినట్లు తెలిపారు. పరిక్ష కేంద్రాల్లోకి ఉదయం 8 :15 గంటల నుంచే అనుమతి ఇస్తామన్నారు. పరీక్షలను ప్రశాంతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లన్నీ చేశామని, ఎలాంటి పొరపాట్లు, కాపీయింగ్‌కు ఆస్కారం లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నామని, నిర్వహణ మొత్తం సీసీ కెమెరాల నిఘాలోనే జరగనున్నాయని తెలిపారు.



అటవీ అధికారుల తీరుపై స్థానిక ఎమ్మెల్యే స్పందించాలి

- సీపీఐ(ఎం) మంచిర్యాల జిల్లా కార్యదర్శి సంకె రవి



నవతెలంగాణ-జైపూర్

పశుకాపర్లను వేదింపులకు గురి చేస్తున్న అటవీ అధికారుల తీరుపై స్థానిక ఎమ్మెల్యే స్పందించాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సంకె రవి డిమాండ్ చేశారు. మంగళవారం చెన్నూర్ పట్టణంలో విలేకరులతో మాట్లాడుతూ చెన్నూర్, కోటపల్లి, భీమారం, వేమనపల్లి మండలాల పరిధిలో గల అటవీ అధికారులు పశువులను అటవీ ప్రాంతంలోకి రానివ్వకుండా వేధింపులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. గొర్లు, బర్లు, మేకల ఆకలి తీర్చడం కోసం అటవీ సరిహద్దుల్లోకి వెళ్లినా అధికారులు అటకాయిస్తున్నారని పేర్కొన్నారు. అంతే కాకుండా పశువుల కాపర్ల నుంచి రూ.5 నుంచి రూ.10 వేలు జరిమాన విధిస్తున్నారని ఆరోపించారు. అంతేకాకుండా కాపర్లను బందించి వారి వద్ద రక్షణగా పెట్టుకున్న గొడ్డండ్లు గుంజుకుని బూతులు తిరుడుతున్న తీరు పట్ల ఎమ్మెల్యే జోక్యం చేసుకోవాలని అన్నారు. గత కొంత కాలంగా అటవీ అధికారులతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న పశుకాపర్ల విషయంలో ఎమ్మెల్యే స్పందించకుంటే సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కమిటి సభ్యులు బోడంకి చందు, చెన్నూర్ మండల నాయకులు సీడం సమ్మక్క, రాతిపల్లి నగేష్, పోశక్క, కరీమా, యామిని, రమాదేవి, రామగాని సమ్మక్క, భూర్తి వెంకటస్వామి, కుమ్మరి బాపు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న ఆర్కే ఓసీపీ మేనేజర్‌కు సన్మానం



నవతెలంగాణ-రామకృష్ణాపూర్

ఆర్కే ఓసీపీ మేనేజర్‌గా విధులు నిర్వహించిన వెంకటేశ్వర్లు ఇందారం ఆర్కే-1ఏ గని ఓపెన్ కాస్ట్ మేనేజర్‌గా బదిలీపై వెళ్లనున్న సందర్భంగా ఆయనకు మంగళవారం బీఆర్ఎస్ పట్టణ ఇన్‌చార్జ్ గాండ్ల సమ్మయ్య ఘనంగా శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా సమ్మయ్య మాట్లాడుతూ మేనేజర్ వెంకటేశ్వర్లు ఓపెన్ కాస్ట్‌లో విధులు నిర్వహించిన సమయంలో నిబద్ధతగా పనిచేస్తూ కార్మికుల సంక్షేమం కోసం కృషి చేసేవాడని, విధులు నిర్వహించే కార్మికుల పట్ల ఎప్పటికప్పుడు రక్షణ సూచనలు అందిస్తూ బొగ్గు ఉత్పత్తి సాధించే దిశగా పనిచేసేవాడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ ఆఫీసర్ గోవిందరావు, ఓసీ రక్షణ అధికారి రామరాజు వెల్ఫేర్ ఆఫీసర్ వంశీ, కౌన్సెలర్ రేవల్లి ఓదెలు, ఏఐటీయూసీ ఫిట్ సెక్రెటరీ ఆంజనేయులు పాల్గొన్నారు.

సెంట్రల్ లైటింగ్ సిస్టమ్ పునరుద్ధరించాలి

- హెచ్‌కేఆర్ ప్రతినిధిని కలిసిన బీఆర్ఎస్ నాయకులు



నవతెలంగాణ-జైపూర్

మండలంలోని ఇందారం గ్రామంలో ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ సిస్టమ్‌ను పునరుద్దరించాలని ఇందారం-2 ఎంపీటీసీ అర్కె స్వర్ణ సంతోష్ యాదవ్ కోరారు. రాజీవ్ రహదారి నిర్వాహణ సంస్థ హెచ్‌కేఆర్ ప్రతినిదిని మంగళవారం కలిసి వినతి పత్రం అందజేశారు. రాజీవ్ రహదారి (స్టేట్ హైవే)లో గల ఇందారం బస్టాండ్ నుంచి సమీపంలో గల ఫ్లైఓవర్ వరకు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేసిన తీరును గుర్తు చేశారు. ఈ మేరకు 2023 అక్టోబర్ 7న జిల్లా పర్యటనకు వచ్చిన మాజీ మంత్రి హరీష్‌రావు సెంట్రల్ లైటింగ్ సిస్టమ్‌ను ప్రారంభించారు. ప్రారంభోత్సవానికి మాత్రమే పరిమితమైన సెంట్రల్ లైటింగ్ సిస్టమ్ పట్ల ఇప్పటి వరకు ఎలాంటి చర్య ప్రతి చర్య లేకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. దీనికోసం ప్రత్యేకంగా విద్యుత్ ట్రాన్స్‌పార్మర్ ఏర్పాటు చేయాల్సివుండగా రాజీవ్ రహదారి నిర్వాహకులు గత ఆరు నెలలుగా నిర్లక్ష్యం చేస్తున్నారని ఆవేధన వ్యక్తం చేశారు. అదే విధంగా రహదారి పొడవు గ్రామ పంచాయతి పరిధిలో సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేసి మిషన్ భగీరథ పైప్‌లైన్ ఏర్పాటు చేశారని తెలిపారు. సర్వీస్ రోడ్డు పక్క నుంచి వేసిన పైప్‌లైన్ తొలగించాలని, సర్వీస్ రోడ్డు పక్కన గల వీది లైట్ స్థంబాలు జరిపించాలని ఈ సంధర్భంగా హెచ్‌కేఆర్ ప్రతినిధిని కోరారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-లక్షెట్టిపేట



మండలంలోని హన్మంతుపల్లి గ్రామానికి చెందిన తొటపల్లి నరేష్(38) గ్రామ శివారులోని వ్యవసాయ బావిలో పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై పి.చంద్రకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. వివరాల్లోకి వెళితే మృతునికి గత పది సంవత్సరాల క్రితం అలేఖ్య అనే అమ్మాయితో వివాహం అయ్యింది. మృతుని ఇంటి ప్రక్కన ఉండే దుమ్మాల శాంతయ్య అనే వ్యక్తి తన ఫోన్‌లో మృతుని భార్య అలేఖ్యతో కలిసి దిగిన ఫోటోలు ఉన్నాయంటూ అందరికి చూపెడుతున్నట్లు తెలియడంతో మృతుడు తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. 26వ తేదిన ఉదయం ఇంటి నుండి బహిర్భూమికి వెల్తున్నట్లు చెప్పి తిరిగి ఇంటికి రాలేదు. మంగళవారం ఉదయం గ్రామం శివారులోని వ్యవసాయ భావిలో శవమై తేలాడు. దుమ్మల శాంతయ్య వేధింపులు భరించలేకనే తన కుమారుడు ఆత్మహత్య చేసుకున్నాడని తండ్రి తోటపల్లి పోషం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

సైన్స్‌తోనే మానవ మనుగడ

- ఫార్మసీ ప్రొఫెసర్ డాక్టర్ వీరబ్రహ్మ కిషన్



నవతెలంగాణ-లక్షెట్టిపేట

సైన్స్ తోనే మానవ మనుగడ సాధ్యమని తెలంగాణ అకాడమీ ఆఫ్ సైన్స్ జోనల్ కోఆర్డినేటర్, ఫార్మసీ ప్రొఫెసర్ డాక్టర్ వీర బ్రహ్మ కిషన్ అన్నారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన ముందస్తు 'నేషనల్ సైన్స్ డే'ను పురస్కరించుకొని 'వికసిత్ భారత్ కోసం దేశీయ సాంకేతికతలు' అనే అంశంపై ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన నిత్య జీవితంలో సైన్స్ పాత్ర మరువలేనిదన్నారు. బయాలజీ, మ్యాథమాటిక్స్, ఫిజిక్స్ మాత్రమే సైన్స్ కాదు అని, సృష్టిలో ప్రతిదీ సైన్స్ తోనే ముడిపడి ఉందనే వాస్తవాన్ని విద్యార్థులు గుర్తించాలన్నారు. ప్రకృతిలో జరుగుతున్న ప్రతి విషయం వెనుక శాస్త్రీయత దాగి ఉంటుందనేది పరిశీలన, ప్రయోగాల ద్వారానే నిరూపించవచ్చున్నారు. 'సర్ సీవీ రామన్ ఎఫెక్ట్' భారత దేశానికి ఎంతో మంచి పేరును తీసుకువచ్చిందన్నారు. ప్రతి విద్యార్థి శాస్త్రీయ దృక్పధంతో చదివితే ఎన్నో కొత్త ఆవిష్కరణలకు బీజం పడుతుందన్నారు. పలు రకాల ఉదాహరణలతో విద్యార్థులలో సైన్స్ పట్ల ఆసక్తి కలిగేలా ప్రసంగించారు. అంతకుముందు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జై కిషన్ ఓజా మాట్లాడుతూ నోబెల్ ప్రైజ్ సాధించినటువంటి సర్ సీవీ రామన్ మన దేశానికి ఎంతో గర్వకారణమన్నారు. పరిమితమైన సౌకర్యాలతోనే ప్రయోగాలు చేసి శాస్త్రీయ దృక్పథాన్ని నెలకొల్పిన సర్ సీవీ రామన్ నేటి యువతకు ఆదర్శమన్నారు. విద్యార్థులకు సైన్స్ ప్రయోగాలతో చదువుపట్ల మరింతగా ఆసక్తిని పెంచేలా తమ కళాశాలలో విద్యను అందిస్తున్నట్లు ఆయన వివరించారు. అనంతరం డాక్టర్ వీర బ్రహ్మ కిషన్‌ను శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ గంగయ్య, ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ పి సవిత, కెమిస్ట్రీ అధ్యాపకులు ఎం కుమారస్వామి పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనే కేంద్ర ప్రభుత్వ లక్ష్యం

- అదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావు
- సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ



నవతెలంగాణ-జన్నారం

గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనే బీజేపీ ప్రభుత్వ లక్ష్యమని ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంతో పాటు బాదంపెల్లి గ్రామాల్లో ఎన్ఆర్ఈజీఎస్ నుంచి రూ.50 లక్షల వ్యయంతో చేపట్టి సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో ప్రజలకు అవసరమైన రోడ్లు, మురికి కాలువలు, తాగునీరు వంటి మౌలిక సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. అభివృద్ధికి అందరూ సహకరించాలన్నారు. బీజేపీ ప్రభుత్వం చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను ప్రజలకు తెలపాలని కార్యకర్తలకు సూచించారు. పేద ప్రజలకు కేంద్ర ప్రభుత్వం ఉచితంగా ఐదు కిలోల బియ్యం అందిస్తున్న, ఆ పథకానికి నరేంద్ర మోడీ ఫోటో పెట్టకపోవడం దారుణం అన్నారు. గ్రామాల్లో అన్ని రకాల మౌలిక సదుపాయాలకు కేంద్ర ప్రభుత్వమే నిధులు ఇస్తుందని అన్నారు. కానీ ఇక్కడి రాష్ట్ర ప్రభుత్వం తామే చేస్తున్నట్లు గొప్పలు చెప్పుకుంటున్నారని విమర్శించారు. రాష్ట్రంలో రెండు ఎంపీ ఎస్టీ రిజర్వ్ స్థానాలు ఉన్నాయని, ఒకటి మహబూబ్‌నగర్‌లో లంబాడ సామాజిక వర్గానికి కేటాయించగా రెండవది ఆదిలాబాద్ నియోజకవర్గాన్ని గోండ్ సామాజిక వర్గానికి కేటాయిస్తూ ఆనవాయితీగా వస్తుందన్నారు. అందులో భాగంగానే మరోసారి తనకే టికెట్ వస్తుందని ఆశాభవం వ్యక్తం చేశారు. ఆదిలాబాద్‌లో ఇప్పటికే నాలుగు బీజేపీ ఎమ్మెల్యే స్థానాలు గెలుచుకొని ఉందన్నారు. వాటన్నిటిని దృష్టిలో ఉంచుకొని బీజేపీ మరోసారి తనకే అవకాశం కల్పిస్తుందని అన్నారు. కేంద్రంలో మరోసారి బీజేపీ ప్రభుత్వం 370 సీట్లతో అధికారంలోకి వస్తుందన్నారు. మిత్రపక్షాలను కలుపుకుంటే 450కి పైగా ఎంపీ స్థానాలు గెలుచుకుంటామన్నారు. ప్రజలు మరోసారి నరేంద్ర మోడీని ప్రధాని చేయడానికి బీజేపీకి ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గోలిచందు, జిల్లా నాయకులు మడుగు ప్రవీణ్ పాల్గొన్నారు.

వృద్ధాప్య పింఛన్ల పంపిణీ పకడ్బందీగా కొనసాగాలి

నవతెలంగాణ-జైపూర్



ప్రభుత్వపరంగా పంపిణీ చేస్తున్న వృద్ధాప్య పింఛన్ల పంపిణీలో ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా పకడ్బంధీగా కొనసాగాలని స్థానిక ఎంపీడీఓ సత్యనారాయణ హెచ్చరించారు. మంగళవారం షెట్‌పల్లి గ్రామంలో పింఛన్ల పంపిణీ పరిశీలించిన ఆయన రూపాయి తేడా లేకుండా లబ్దిదారులకు పింఛన్ సొమ్ము ఇవ్వాలని సూచించారు. పింఛన్ల పంపిణీలో తీరులో లోపాలుంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. దీనికి ముందు కుందారం గ్రామ పంచాయతీ పరిధిలో గల చెరువులో కొనసాగుతున్న చేపల కుంట పనులను ఏపీఓ వెంకటేశ్వర్లుతో కలిసి పరిశీలించారు. గ్రామ పంచాయతీ పరిధిలో ఉపాధి కూలీల హాజరు శాతం పెంచాలని ఆదేశించారు. వేసవి ఎండలు ముదురుతున్నందున సకాలంలో వచ్చి పనులు కొనసాగించాలని సూచించారు.

అభివృద్ధి పనులను పరిశీలించిన ఎంపీడీఓ

నవతెలంగాణ-తలమడుగు

మండలంలోని మారుమూల గిరిజన గ్రామమైన కోసాయి, దేగామ గ్రామాల్లో మంగళవారం ఎంపీడీఓ శేఖర్, ఎంపీఓ వినోద్ ప్రభుత్వం మంజూరు చేసి ప్రారంభించిన, పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. గ్రామంలో కొత్తగా నిర్మిస్తున్న గ్రామపంచాయతీ భవనం, మురుగు కాలువల నిర్మాణం, మిషన్ భగీరథ మంచినీటి సరఫరాను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ మండలంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను నాణ్యతగా నిర్మించాలని కోరారు. ఇటు ప్రజలకు ఉపయోగపడే పనులను చేయాలని, నాసిరకంగా నిర్మాణాలు చేపట్టవద్దని అన్నారు. వేసవికాలం దృష్ట్యా పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో నీటి సమస్య ఏర్పడకుండా చూడాలని తెలిపారు. మండలంలో జరుగుతున్న పనులను త్వరగా పూర్తి చేయాలని కోరారు. ఎంపీడీఓ వెంట మాజీ సర్పంచ్ సుభాష్, పంచాయతీ కార్యదర్శి, గ్రామస్తులు ఉన్నారు.

విద్యార్థినులకు షీటీం ఆధ్వర్యంలో అవగాహన

నవతెలంగాణ-జైనథ్



మండలంలోని పిప్పర్‌వాడ గ్రామ ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు షీటీం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా షీటీం అధికారిణి సుశీల పోకిరీలు అసభ్యంగా ప్రవర్తించినా, అసభ్యకరంగా మాట్లాడినా, వెంటపడి వేధించిన వెంటనే షీటీం మొబైల్ నెంబర్ 8712659953కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని తెలిపారు. అంతేకాకుండా మాదకద్రవ్యాల గురించి అవగాహన కల్పించారు.

సీపీఐ సహాయ కార్యదర్శి పదవికి రాజీనామా



నవతెలంగాణ-బోథ్

సీపీఐ మండల సహాయ కార్యదర్శి పదవికి రాజీనామా చేస్తున్నట్టు షేక్ షాకిర్ తెలిపారు. రాజీనామా పత్రాన్ని మంగళవారం పార్టీ కన్వీనర్‌కు అందించాడు. అనివార్య కారణాలతో రాజీనామా చేశానన్నారు. పార్టీతో తనకున్న బంధం మరువలేనిదని గుర్తు చేశారు. ఉద్యమాల ఓనమాలు నేర్పిన పార్టీలో ఇన్ని రోజులు పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నానని పేర్కొన్నారు.

ఆర్అండ్‌బీ రోడ్డుకు మరమ్మతులు చేయాలి



నవతెలంగాణ-ఉట్నూర్

ఎక్స్ రోడ్డు నుండి హస్నాపూర్ వరకు ఆర్అండ్‌బి రోడ్డుకు మర్మతులు చేయాలని గరీబ్ వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షులు బానోత్ జగన్‌నాయక్ అన్నారు. మండల కేంద్రంలోని లింగోజి తండా(ఎక్స్ రోడ్) నుండి ఆసిఫాబాద్‌కు వెళ్లే జాతీయ రహదారికి మరమ్మతులు చేయాలని మంగళవారం వాహనదారులు ఆగి గుంతలను చూపించారు. గుంతల వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని, అయినా సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదని వాహనదారులు మండిపడ్డారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు రోడ్డుకు మరమ్మతులు చేసి ప్రమాదాలను అరికట్టాలని సూచించారు.

మున్సిపల్ చైర్మెన్ ఎన్నికకు కాంగ్రెస్ బీ ఫాం

నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్

నేడు జరగనున్న ఖానాపూర్ మున్సిపాలిటీ చైర్మెన్ ఎన్నిక కోసం ఫ్లోర్ లీడర్ చిన్నం సత్యంకు మంగళవారం ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు బీ ఫాం అందజేశారు. మున్సిపాలిటీ చైర్మెన్ సీటును కాంగ్రెస్ హస్తగతం చేసుకుంటుందని ఈ సందర్భంగా ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కట్కం రవి, షబ్బీర్ పాషా ఉన్నారు.

విశాల్‌ను ఆదుకున్న ఎమ్మెల్యే బొజ్జు

నవతెలంగాణ-ఉట్నూర్

మోకాళ్ల నొప్పులతో బాధపడుతున్న విశాల్‌కు ఎమ్మెల్యే బొజ్జు పటేల్ సీఎం సహాయ నిధి నుండి రూ.2లక్షల చెక్కును అందించారు. ఆదిలాబాద్ పట్టణంలోని కాటన్ మార్కెట్ ప్రాంతానికి చెందిన విశాల మోకాళ్ల నొప్పుల ఆపరేషన్ల కోసం సాయం చేశారు. ప్రజల వైద్యం కోసం ఆరోగ్యశ్రీ సాయాన్ని రూ.5 లక్షల నుండి రూ.10లక్షలకు పెంచిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు.

ఉపాధ్యాయులు విధులను సక్రమంగా నిర్వహించాలి

నవతెలంగాణ-సిరికొండ

ఉపాధ్యాయులు తమ విధులను సక్రమంగా నిర్వహించాలని సిరికొండ ఇన్‌చార్జి ఎంఈఓ రాథోడ్ ఉదయ్‌రావ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని జెడ్పీఎస్ఎస్ పాఠశాలను, రాయిగూడ ఆశ్రమ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించి, విద్యార్థులకు సరియైన బోధన అందించాలని అన్నారు. విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

గిరిజన ఉద్యమకారులకే పార్లమెంట్ స్థానాన్ని కేటాయించాలి

నవతెలంగాణ-కడెం

ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానాన్ని ఆదివాసీ గిరిజన ఉద్యమకారులకే కేటాయించాలని ఆదివాసీ జేఏసీ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వైస్ చైర్మెన్ ఆత్రం రవీందర్ కోరారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా ఆదివాసీ గిరిజనులు అత్యంత వెనుకబడి ఉన్నారన్నారు. గతంలో ఇక్కడ గెలుపొందిన నాయకులు వారు ఎదిగారే తప్ప గిరిజనుల అభివృద్ధికి ఏమాత్రం సహకరించలేరన్నారు. ఇప్పటికైనా బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల రాష్ట్ర అధ్యక్షులు ఆదిలాబాద్ పార్లమెంటు స్థానాన్ని ఆదివాసీ గిరిజన నాయకులకు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. లేనియెడల ప్రజలు తమ ఓటుతో బుద్ధి చెప్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం

నవతెలంగాణ-దిలావర్‌పూర్

మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం నుంచి ప్రారంభం కాబోయే ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు అధికారులు, కళాశాల సిబ్బంది పూర్తి స్థాయి ఏర్పాట్లు చేశారు. పరీక్షా కేంద్రాన్ని తహసీల్దార్ బి.స్వాతి మంగళవారం పరిశీలించారు. ఇంటర్ మొదటి సంవత్సరం జనరల్ విభాగంలో 197 మంది విద్యార్థులు, వోకేషన్ విభాగంలో 26 విద్యార్థులు. ద్వితీయ సంవత్సరంలో జనరల్ విభాగంలో 209 మంది విద్యార్థులు, వోకేషన్ విభాగంలో 27 మంది విద్యార్థులకు సదుపాయాలు కల్పించామని చిఫ్ సూపరింటెండెంట్ కె. శంకర్, డిపార్టుమెంట్ అధికారి ఎ.లక్ష్మీకాంత్ తెలిపారు.

ఎన్నికల నిర్వహణకు పార్టీలు సహకరించాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



రానున్న పార్లమెంట్ ఎన్నికల నిర్వహణ కొరకు జిల్లాలో అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని జిల్లా కలెక్టర్ హేమంత్ బొర్కడే అన్నారు. మంగళవారం ఆర్‌డిఓ లోకేశ్వర్‌రావుతో కలిసి గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటర్ జాబితా సవరణ కార్యక్రమం-2024, వచ్చే లోక్ సభ ఎన్నికల ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న పార్లమెంట్ ఎన్నికల కొరకు జిల్లాలో అన్ని ఏర్పాట్లు చేయడం జరుగుతుందని, ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల మొదటి విడత పరిశీలన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పూర్తి చేయడం జరిగిందని తెలిపారు. ర్యాండంగా వివి ప్యాట్లలో మాక్ పోలింగ్ నిర్వహించడం జరిగిందని, ఓటరు జాబితాపై ఏదైనా అభ్యంతరాలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. జిల్లాలో ప్రజల సౌకర్యార్థం అదనపు పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటున్నామని, రానున్న పార్లమెంట్ ఎలాంటి పొరపాట్లు లేని సమర్థవంతమైన ఎన్నికల నిర్వహణ కొరకు సెక్టార్ అధికారులను నియమించి శిక్షణ ఇవ్వడం జరిగిందని పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న ఓటరు గుర్తింపు కార్డులను సిద్ధం చేసి తపాలా శాఖ ద్వారా పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రానున్న పార్లమెంట్ ఎన్నికలను జిల్లాలో ప్రశాంత వాతావరణంలో నిర్వహించే విధంగా రాజకీయ పార్టీలు సహకరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం అధికారులు, రాజకీయ పార్టీ ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఇంద్రాదేవికి సాంప్రదాయ పూజలు

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

మండలంలోని ఇంద్రాదేవికి మెస్రం వంశీయులు ఖటోడ (పూజారి) షేకు కుటుంబ సమేతంగా సాంప్రదాయ పూజలు చేశారు. కేస్లాపూర్ నాగోబా దేవత తరువాత భుడుందేవ్ జాతర విజయవంతం కావడంతో మంగళవారం ఇంద్రాదేవికి వారి సాంప్రదాయ పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. తమ కుటుంబాన్ని ఆరోగ్యంగా ఉంచాలని, వచ్చే ఏడాది పాడి పంటలు సమృద్ధిగా పండాలని దేవుళ్లను మొక్కారు. ఇంద్రాదేవి పూజ అనంతరం ఆవరణలో ఉన్న సూర్య, చంద్ర జెండాకు ప్రత్యేకపూజలు చేశారు. ఇంద్రాదేవి ఆలయం వెనుక భాగంలో మురికి, చెత్త చెదారానికి నిలయంగా మారిందని మాజీ సర్పంచ్ మెస్రం నాగనాథ్ పేర్కొన్నారు. ఇంద్రాదేవి ఆవరణలో భక్తుల సౌకర్యార్థం సీసీ రోడ్డు నిర్మాణంతో పాటు మురికి కాలువను శుభ్ర పర్చాలని ఆయన పేర్కొన్నారు.

పెండింగ్ భూసేకరణ కేసుల పరిష్కారానికి చర్యలు చేపట్టాలి

నవతెలంగాణ-నిర్మల్

ప్రభుత్వశాఖల్లో పెండింగ్ భూసేకరణ కేసుల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని, జిల్లా కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. ఈనెల 26న జిల్లా సెషన్స్ కోర్టులో నిర్వహించిన సమావేశంలోని వివిధ శాఖలకు సంబంధించిన అంశాలపై మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. భూసేకరణ పెండింగ్ కోర్టు కేసులు, తీర్పు వచ్చిన కేసులకు సంబంధించి తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. వీటితో పాటుగా నీటిపారుదల, రోడ్లు భవనాల శాఖలకు సంబంధించి ఇతర అంశాల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్ కిషోర్ కుమార్, డీఆర్ఓ గంగయ్య, నీటిపారుదల శాఖ ఎస్ఈ సుశీల్, ఆర్ అండ్ బి ఈఈ అశోక్, అధికారులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ కౌన్సిలర్లకు విప్ జారీ

నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్

ఖానాపూర్ మున్సిపాలిటీలో గత చైర్మెన్‌పై అవిశ్వాసం కారణంగా నేడు జరుగనున్న కొత్త చైర్మెన్ ఎన్నికలో బీఆర్ఎస్ కౌన్సిలర్లు పాల్గొన వద్దని ఆపార్టీ అదిష్టానం మంగళవారం విప్ జారీ చేసింది. మొన్నటి వరకు బీఆర్ఎస్ నుంచి చైర్మెన్‌గా కొనసాగిన అంకం రాజేందర్‌పై కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీకి చెందిన మెజార్టీ సభ్యులు అవిశ్వాస తీర్మాణం నోటీసు ఇచ్చారు. ఈ క్రమంలో బుధవారం కొత్తగా కానున్న చైర్మెన్ ఎన్నికలో బీఆర్ఎస్‌కు చెందిన ఒకటో వార్డు కౌన్సిలర్లు కావలి సంతోష్, 3వ వార్డు కౌన్సిలర్ జన్నారపు విజయలక్ష్మీ 5వ వార్డు కౌన్సిలర్ పరిమి లతపై ఆపార్టీ అధిష్టానం విప్ జారీ చేసింది. ఈ మేరకు సదరు పత్రాలను కలెక్టర్‌కు అందజేసినట్టు బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. పార్టీ వ్యతిరేఖ కార్యక్రమాలకు పాల్పడిన వారిపై క్రమశిక్షణ చర్యలతో పాటు న్యాయపరమైన చర్యలు ఉంటాయని పేర్కొన్నారు.

వక్ఫ్ బోర్డ్ చైర్మెన్‌ను కలిసిన నాయకులు

నవతెలంగాణ-నార్నూర్

తెలంగాణ రాష్ట్ర ఉర్దూ అకాడమీ హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర వక్ఫ్ బోర్డ్ చైర్మెన్ సయ్యద్ అజ్మత్ ఉల్లాహ్‌ను మండల మైనారిటీ కాంగ్రెస్ పార్టీ నాయకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారికి ఉన్న సమస్యలను వివరించారు. కలిసిన వారిలో నాయకులు యూసుఫ్ ఖాన్, కరీమ్‌ఖాన్, అడే మాణిక్‌రావ్, షాహిద్, జిల్లా నాయకులు ఉన్నారు.

నేడు దివంగత పి.నర్సారెడ్డి సంస్మరణ సభ

నవతెలంగాణ-నిర్మల్

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ పీసీసీ అధ్యక్షులు, మాజీ మంత్రి దివంగత పొద్దుటూరి నర్సారెడ్డి సంస్మరణ సభ పురపాలక సంఘం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహిస్తున్నట్టు మున్సిపల్ చైర్మెన్ గండ్రత్ ఈశ్వర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. నిర్మల్ జిల్లా కేంద్రంలోని మంజులాపూర్ రోడ్‌లోని మారుతి ఇన్ హోటల్లో సాయంత్రం 4 గంటలకు సంస్మరణ సభ ఉంటుందని, నర్సారెడ్డి అభిమానులు, అన్ని పార్టీల నాయకులు, పురప్రముఖులు, పెద్ద ఎత్తున హాజరుకావాలని కోరారు.

విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకతను గుర్తించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకే హస్తకళా ప్రదర్శణలు దోహద పడతాయని డీఈఓ ప్రణీత అన్నారు. మంగళవారం పట్టణంలోని భుక్తాపూర్ మరాఠీ మీడియం పాఠశాలలో ఉపాధ్యాయురాలు కవిత ఆధ్వర్యంలో విద్యార్థులచే నిర్వహించిన హస్తకళా ప్రదర్శణకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డీఈఓ మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు హస్తకళల్లో సైతం రాణించాలని అన్నారు. ఉపాధ్యాయురాలు కవిత ఇలాంటి ప్రదర్శనలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ జయశీల, ప్రధానోపాధ్యాయులు కిల్లారే దేవిదాస్, విజయలక్ష్మి, పాఠశాల సిబ్బంది వైశాలి, గోపాల్, రితేష్, రాజశ్రీ పాల్గొన్నారు.

చంద్రశేఖర్ అజాద్ వర్ధంతి

నవతెలంగాణ-తాంసి

భీంపూర్ మండలం పిప్పల్‌కోటి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం ప్రముఖ స్వాతంత్ర్య పోరాట యోధుడు చంద్రశేఖర్ అజాద్ వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి ప్రధానోపాధ్యాయులు మహేష్ సిబ్బంది పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 25 ఏండ్ల ప్రాయంలోనే స్వాతంత్ర్యం కోసం పోరాడుతూ తన ప్రాణాన్ని త్యాగం చేసిన మహనీయుడని అన్నారు. 1919లో జరిగిన జలియన్‌వాలాబాగ్ దుశ్చర్య ఆయన మనసును బాగా కదిలించి వేసిందన్నారు. 1928 సెప్టెంబర్‌లో భగత్ సింగ్ సుఖదేవ్ రాజగురులతో కలిసి హిందుస్థాన్ సోషలిస్ట్ రిపబ్లిక్ అసోసియేషన్ సంస్థను స్థాపించారని అన్నారు. దేశానికి ఏ విధంగా నైనా స్వాతంత్ర్యం తీసుకొని రావాలనేది ఆయన దృఢ సంకల్పమని అన్నారు. స్వాతంత్ర్య ఉద్యమకారులను అణగదొక్కే బ్రిటిష్ అధికారులపై ఆజాద్ తన సహచరులతో కలిసి దాడి చేశారని తెలిపారు. 1931 ఫిబ్రవరి 27న బ్రిటిష్ చేతుల్లో చావకూడదన్న ఆలోచనతో, తనను తాను కాల్చుకొని మరణించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శంకర్, వికేష్, సంధ్య, వీరకుమార్ విద్యార్థులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మోసాల పట్ల జాగ్రత్తగా ఉండాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

ప్రస్తుతం బ్యాంక్ సేవలు ఎంత వేగంగా అందుబాటులోకి వచ్చయో అంతే వేగంగా ఆన్‌లైన్ మోసాలు కూడా జరుగుతున్నాయని వాటి పట్ల అప్రమత్తంగా ఉండాలని ఇన్‌చార్జీ డీఆర్ఓ రాథోడ్ రమేష్ సూచించారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల్లో భాగంగా మంగళవారం ఇందిరా ప్రియదర్శిని స్టేడియం నుంచి 2కే రన్ చేపట్టారు. దీనికి డీఆర్ఓ ముఖ్యఅతిథిగా హాజరై క్రీడ జ్యోతిని వెలిగించగా, డీఎస్ఓ వెంకటేశ్వర్లు జెండా ఊపి రన్‌ను ప్రారంభించారు. రన్‌లో పాల్గొన్న వారికి టీషర్టులు, టోపీలు అందించారు. ఈ సందర్భంగా డీఆర్డీఓ రమేష్ రాథోడ్ మాట్లాడుతూ ఆర్బీఐ ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల్లో భాగంగా బ్యాంక్ సేవలపై ప్రజలకు అవగాహన కల్పించేలా మూడు రోజుల పాటు కార్యక్రమాలు చేపడుతుందన్నారు. పెరుగుతున్న సాంకేతికత కారణంగా మోసాలు కూడా పెరుగుతున్నాయన్నారు. బ్యాంక్ నుంచి ఎలాంటి మేసేజ్ వచ్చిన వెంటనే వాటిని సంబంధిత బ్యాంకుకు వెళ్లి సరి చూసుకోవాలన్నారు.

బాలల హక్కుల పరిరక్షణ ఉపయోగించుకోవాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

గ్రామస్థాయి నుంచి బాలల హక్కుల పరిరక్షణ, బాలల సంబంధిత సమస్యల నిర్మూలన గురించి మంగళవారం సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని ఓల్డ్ డీఆర్డీఏ వేదికగా నిర్వహించిన కార్యక్రమంలో ఆదిలాబాద్ రూరల్ మండలంలోని అంకోలి ఉన్నత పాఠశాల విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలోని బాలల సంబంధిత సమస్యలైనటువంటి బాల కార్మికత, బాల్యవివాహాలు, ఇతర సమస్యల గురించి, వాటి పరిష్కారాల గురించి, విద్యార్థులు చర్చించడం జరిగిందన్నారు. దీనికి రాష్ట్రంలోని పలు జిల్లాలకు చెందిన పాఠశాలల విద్యార్థులు హాజరయ్యారు. మహిత స్వచ్ఛంద సంస్థ, యూనిసెఫ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో యూనిసెఫ్ కంట్రీ డైరెక్టర్లు జెలైలిమ్, మెయోసో, ప్రసూన్‌సెన్, చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ మురళి, డేవిడ్, జిల్లా సంక్షేమాధికారి లలిత కుమారి, జిల్లా బాలల పరిరక్షణ అధికారి రత్నం, మహిత డైరెక్టర్ రమేష్, శేఖర్‌రెడ్డి, సదానంద్ రెడ్డి, బాలచందర్, త్రివేణి, ఆదిలాబాద్ రూరల్ మండల కోఆర్డినేటర్ ఆదర్శ, అక్షయ్, సాయి చరణ్, మార్కండి, వివిధ జిల్లాల విద్యార్థులు పాల్గొన్నారు.

నేటి నుంచి స్విమ్మింగ్ ఫూల్ ప్రారంభం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ఉన్న ఈత కొలను ఈనెల 28 నుంచి ప్రారంభమవుతుందని ఈత శిక్షకుడు కొమ్ము కృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మలినమైన నీటిని తొలగించి కొత్త నీరును కొలనులో నింపామని, ఈ విషయాన్ని సాధకులు గమనించాలని కోరారు. ప్రతిరోజు ఉదయం 6 గంటల నుంచి 9 గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు అందుబాటులో ఉంటుందని, సాధకులు తప్పనిసరి తమ గుర్తింపు కార్డులను వెంట తీసుకురావాలని సూచించారు.

తెల్ల జొన్న పంటల పరిశీలన

తలమడుగు : మండలం కేంద్రానికి చెందిన రైతులు బడగారి రమాకాంత్, బడగారి స్వామి తెల్ల జొన్న పంటలను మంగళవారం రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షులు సంగెపు బోర్రన్న పరిశీలించారు. గత రెండు సంవత్సరాల నుంచి తెల్ల జొన్న పంటని సాగు చేస్తుండటంతో రైతుల పంట పొలాన్ని పరిశీలించినట్టు తెలిపారు. రబీ పంటలో సాగు చేస్తున్న తెల్ల జొన్న పంటకీ అయిన ఖర్చుల వివరాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం ఆదిలాబాద్ జిల్లాలో 1లక్ష 55వేల ఎకరాలలో వివిధ రకాలైన పంటలతో పాటు తెల్లజొన్న పంటలను పండిస్తున్నారు. గతంలో 38 వేల ఎకరాలలో సాగుచేస్తే, ఈ ఏడాదిలో 62 వేల 623 ఎకరాలలో సాగు చేస్తున్నట్టు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం మద్దతు ధర రూ.3వేల కంటే ఎక్కువుగా ఉండటం ద్వారా రైతులు తెల్ల జొన్న పంటపై ఆసక్తి చూపుతున్నారు. మరొక పక్క కౌలు రైతులు, పోడు వ్యవసాయం చేస్తున్నా రైతులను పరిగణలోకి తీసుకొని వ్యవసాయశాఖ, వారు అమ్ముకునే సమయంలో అవకాశాలు కల్పించాలని అన్నారు. పంటలను పరిశీలించిన వారిలో రైతులు నేతుల గంగన్న, బడగారి స్వామి, రమాకాంత్, వినోద్, రైతులు, గ్రామస్తులు ఉన్నారు.

కృత్రిమ మేధాధారిత యాంకర్‌ను సృష్టించిన ఉపాధ్యాయుడు

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్



తనకున్న కంప్యూటర్ పరిజ్ఞానంతో ఓ సాధారణ ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఏకంగా ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ ఆధారిత న్యూస్ యాంకర్‌ను సృష్టించి ఔరా అనిపించారు. ఆదిలాబాద్ జిల్లా మావల మండలం వాఘాపూర్ గ్రామానికి చెందిన తొడసం కైలాస్ తలమడుగు మండలం సాయిలింగి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. గోండి భాషకు లిపి లేకపోవడంతో తెలుగు లిపితో గోండి భాషలో రాసిన కవిత్వాలు ఏఐ యాంకర్ ద్వారా చదివి వినిపించడం నిజంగా గొప్ప విషయమన్నారు. నిజానికి తెలుగు లిపిలో గోండి భాషలో రాయడం చాలా ఇబ్బంది. కానీ కైలాస్ దానిని ఏఐ ద్వారా అధిగమించాడు. తను రాసిన సద్విచార్ అనే పుస్తకాన్ని అచ్చు తప్పు లేకుండా ఏఐ ద్వారా ఎడిటింగ్ చేస్తున్నారు. ఈ పుస్తకం యువతను మేలుకొలిపేదిగా ఉంటుందని తెలిపారు. ఈపాటికే వాటిని తన యుట్యూబ్ చానెల్ ద్వారా విడుదల చేశారు. త్వరలోనే పుస్తకాన్ని సైతం విడుదల చేస్తానని ఆయన చెప్పుకొచ్చారు. గోండి భాషకు మక్కువ తేవాలని ప్రస్తుత తరుణంలో గోండి భాషకు ఆదరణ తగ్గిపోతున్న సందర్భంలో ఆయన భాష పైన లోతుగా అధ్యయనం చేయసాగారు. ఇప్పుడు దాదాపు వాడుకలో లేని కొన్ని పదాలను ఆయన తన పూర్వీకులు ఉపయోగించిన భాషను గుర్తు చేసుకొని స్వచ్ఛమైన గోండి భాషలో పుస్తకాన్ని రాశారు. పుస్తక రచన సమయంలో సందేహాలు తలెత్తితే, వాళ్ల అక్క సరస్వతిని అడిగి సందేహాలు నివృత్తి చేసుకుంటూ గోండిలో ఉచ్చారణ దోషాలు లేకుండా ఏఐ ద్వారా ఎడిటింగ్ చేస్తున్నారు. ఈ పుస్తకాన్ని తానే స్వయంగా మొబైల్‌లో టైప్ చేసి రాస్తున్నారు. రాసిన వాటిని గూగుల్ డాక్యుమెంట్స్ బ్లాగర్‌లో భద్రపరుస్తున్నారు. ఇప్పటికే రాసిన వాటిని యూట్యూబ్ ద్వారా కొన్నిటిని విడుదల చేశారు. గోండి భాషలో వార్తలు ఉండాలన్న ఉద్దేశంతో గోండి భాషలో సైతం వార్తాలు ఉంటే బాగుండునని తలచిన ఆయన గోండి భాషలో వార్తా ఛానల్స్ లేకపోవడంతో స్వయంగా తనే తన యూట్యూబ్ ఛానల్ కైలాస్ తొడసం వ్లాగ్ ద్వారా ప్రతి రోజు ఉదయం సాడ కాండీర ప్రార్థనత్ సాటి నేట సమాచార్ అంటే పాఠశాల అసెంబ్లీ వార్తాలు రాసి యూట్యూబ్‌లో ఏఐ యాంకర్ సుంగాల్ తుర్పే సృష్టించి వార్తాలు చదివించే ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. ఈ వార్తల్ని అన్ని ఆశ్రమ పాఠశాలల్లో, గిరిజన పాఠశాలల్లో ఉపాధ్యాయులు వినిపిస్తున్నారు. ఈవిధంగా ఆయన మరుగున పడిపోతున్న గోండి భాషకు ఊపిరి పోస్తున్నారు.

కంప్యూటర్ విభాగంలో అనుభవంతోనే సాధ్యం

ఇదంతా ఓ సాధారణ ఉపాధ్యాయుడు చేశాడంటే ఏ మాత్రం నమ్మశక్యంగా ఉండదు. కానీ ఈయన ఎంచుకున్న ఉపాధ్యాయ వృత్తిలో మరిన్ని పోకడలకు శ్రీకారం చుట్టి మరింత ప్రభావవంతమైన భోధన సాగించాలన్న ఉద్యేశంతో చెన్నైలోని ఓ ఇన్స్టిట్యూట్ ద్వారా ఆన్‌లైన్‌లో కోచింగ్ తీసుకున్నారు. దాంతో పాటు 15సంవత్సరాల కంప్యూటర్ అనుభవం ఈయన ఏఐ యాంకర్ తయారీకి ఉపయుక్తంగా మారిందన్నారు. హేజెన్ అనే సాఫ్ట్వేర్ ఆధారంగా కంప్యూటర్‌లో ఈ ఏఐ కృత్రిమ మేధ యాంకర్‌ను సృష్టించినట్లు ఆయన పేర్కొన్నారు. అవకాశం ఉంటే రోబో తయారు చేస్తానని అన్నారు. భవిష్యత్తులో మరిన్ని అవకాశాలు వస్తే ప్రభుత్వం నుంచి ఇతరుల నుంచి ఆర్థిక సహకారం అందితే గోండి భాషలో రోబోను తయారు చేస్తానని ఆయన పేర్కొన్నారు.